# అంధయుగం

(శ్రీ ధర్మవీర్ భారతి హిందీలో వ్రాసిన "అంధాయుగ్" నాటకానికి స్వేచ్ఛానువాదం)

డాక్టర్ మొదలి సరస్వతి
డాక్టర్ మొదలి నాగభూషణ శర్మ

## పాత్రలు

| | |
|---|---|
| అశ్వత్థామ | |
| గాంధారి | విదురుడు |
| ధృతరాష్ట్రుడు | యుధిష్ఠిరుడు |
| కృతవర్మ | కృపాచార్యుడు |
| సంజయుడు | యుయుత్సుడు |
| రక్షకభటుడు – 1 | రక్షకభటుడు – 2 |
| వ్యాసుడు | బలరాముడు |
| కృష్ణుడు | |

## సంఘటనా కాలం

మహాభారత యుద్ధంలోని పద్దెనిమిదవరోజు సాయంకాలం నుంచి ప్రభాసతీర్థంలోని కృష్ణుని మృత్యువు సంభవించినంత వరకు.

## స్థాపన

(నేపథ్యం నుంచి ప్రకటన వినిపిస్తూ ఉంటుంది. రంగస్థలం మీద అందుకు తగిన భావాలతో అభినయం చేస్తూ ఉంటాడు. నర్తకుడు. శంఖధ్వనితో తెరలేస్తుంది. మంగళాచరణంతో పాటు నమస్కార ముద్రతో వెనకనుంచి వినవచ్చే ధ్వనులకు అనుగుణంగా ముద్రలను మారుస్తాడు నర్తకుడు.)

## మంగళాచరణం

"నారాయణం నమస్కృత నరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతోజయ ముదీయరేత్"

## (ప్రకటన)

ఈ నాటకానికి సంబంధించిన యుగాన్ని గురించి విష్ణుపురాణం ఇలా వర్ణించింది:

"తతశ్చానుదిన మల్పాల్పప్రాస
వ్యవచ్ఛే దదాద్ధర్మార్థయోర్జగత్ సంక్షయో భవిష్యతి"
భవిష్యత్తులో ధర్మాధర్మాలు రెండూ తిరోగమిస్తాయి. ధరిత్రి నెమ్మదిగా క్షయిస్తుంది.

"తతశ్చార్థ ఏవాభిజనహేతు"
అర్థం ఉన్నవాడిదే అధికారం.

"కపట వేషధారణ మేవ మహత్వహేతు:"
కపటవేష ధారణమే గొప్పతనానికి కారణం అవుతుంది.

"ఏవమ్ చాతిలుబ్దక రాజాం
సహాశ్శైలానా మంతర్ ద్రోణీ ప్రజాసంశ్రియష్యంతి"
శక్తిహీనులైన రాజుల వలన ప్రజలు ఇబ్బందులపాలై కొండగుహల్లో తలదాచుకుని రోజుల వెళ్ళబుచ్చుతారు.

(గుహల్లో దాక్కున్నట్లు అభినయం చేస్తూ నర్తకుడు నిష్క్రమిస్తాడు.)

యుద్ధం జరిగిన తరువాత అవతరించింది ఈ అంధయుగం. ఇందులో పరిస్థితులు, మనోవృత్తులు, ఆత్మలు – అన్నీ వికృతంగా ఉన్నాయి. "మర్యాద" అనేది పుటుక్కుమని తెగే దారంలా ఉంది. ఆ దారం కూడా ఇరుపక్షాల మధ్య చిక్కుకొనిపోయి ఉంది.

ఆ బిక్కును విప్పగల సాహసం ఒక్క శ్రీకృష్ణుడిలోనే ఉంది.
అతడే భవిష్యత్తుకు భద్రత కలిగించగలడు.
అనాసక్తుడు.
మిగిలిన వాళ్ళు – చాలామంది అంధులు, పదభ్రష్టులు
ఆత్మగౌరవహీనులు, విచలితులు
చీకటి గుహల్లో నివసించే వాళ్ళు.
ఈ అంధుల కథ ఇది.
అంధుల ద్వారా చెప్పబడుతున్న జ్యోతి కథ.

**మొదటి అంకం: "కౌరవ నగరం"**

**(మూడుసార్లు తూర్యనాదం. తరువాత)**

# కథాగానం

కౌరవ పాండవులిద్దరూ –

(తెరలేస్తూనే రంగస్థలం ఖాళీగా ఉంటుంది. ఇద్దరు రక్షకభటులు బల్లాలు, డాళ్ళు, పుచ్చుకుని, యాంత్రికంగా రంగస్థలం అంచున అటునుంచి ఇటు, ఇటునుంచి అటు తిరుగుతూ ఉంటారు.)

1వ ర: అలసిపోయిన మనం
శూన్యమైన ఈ వీధుల్లో
కాపలా తిరుగుతున్నాం.

2వ ర: అవును. శూన్యమైన వీధులే!
రత్నాలతో తాపితమైన
ఈ చలువరాళ్ళ మీద
మత్తెక్కిన పవన తరంగాల్లా
కౌరవ వధువులు తిరిగేవారు.
ప్చ్! ఇప్పుడు వాళ్ళు విధవలు.

1వ ర: అలిసిపోయాం మనం.
యుద్ధంలో పోరాడి కాదు.
పదిహేడు రోజుల రోమాంచితమైన
ఈ యుద్ధానికి కాపలా వాళ్ళం మనం.
మన బల్లాలు, డాళ్ళు వ్యర్థంగా పడిఉన్నాయి.
ఒంటికి బరువుగా పడి ఉన్నాయి.
మనం రక్షకులమే
కాని రక్షించడానికేమీ లేదు ఇక్కడ.

2వ ర: రక్షించదగిందేమీ లేదా ఇక్కడ?
సంస్కృతి లేదూ?
ఒక గుడ్డివాడి సంతానం
మహాయుద్ధాన్ని ప్రకటించింది.
ఆ గుడ్డితనంతోనే – మర్యాద –
అందం కరిగిపోయిన వేశ్యలా,
ప్రజలందరినీ అంటురోగుల్లా
మారుస్తూ, తిరిగింది.
ఆ గుడ్డి సంస్కృతినీ,
రోగగ్రస్థమైన మర్యాదనీ
మనం పదిహేడు రోజులుగా

రక్షిస్తున్నాం.

1వ ర: ఇంతకూ మనల్నింత
అలిసిపోయేటట్లుగా చేసిందెవరు?
మన శ్రమ వ్యర్థం
నమ్మకం వ్యర్థం
సాహసం, శ్రమ, మన ఉనికి –
వీటికీ అర్థం లేకుండా పోయింది.

2వ ర: అర్థం లేదు. కొంచెం కూడా అర్థం లేదు.
జీవితంలోని అర్థహీనమైన, శూన్యమైన మార్గాల్లో
కాపలాకాసి కాసి అలసిపోయాం మనం
సొలిసిపోయాం మనం.

(మాట్లాడకుండా అటూఇటూ తిరుగుతూ వుంటారు. ఉన్నట్టుండి వెలుతురు నెమ్మదిగా తగ్గిపోతుంది. నేపథ్యం నుంచి తుఫాను ధ్వని. ఒకడు చెవి ఒగ్గి వింటాడు. రెండో వాడు కళ్ళకు చెయ్యిఅడ్డంపెట్టుకుని ఆకాశం వైపు చూస్తాడు.)

1వ ర: వింటున్నావా? ఏమిటీ భయంకరమైన ధ్వని?

2వ ర: ఉన్నట్టుండి చీకట్లు కమ్ముకుంటున్నాయి.
చూడు – ఏమన్నా కనిపిస్తోందా?

1వ ర: గుడ్డిరాజు రాజ్యంలో జనం ఏం చూడగలరు?
ఏమీ కన్పించడం లేదు.
ఆ! బహుశః మేఘ గర్జనేమో?
(రెండవ రక్షకభటుడు పక్కకు వచ్చి చూస్తాడు. భయభ్రాంతుడవుతాడు.)

2వ ర: మేఘాలు కావు.
అవి రాబందులు.
లక్షలు, కోట్లు
రెక్కలు విప్పకుని –

(టపటప లాడిస్తున్న రెక్కలు చప్పుడుతో రంగస్థలం మరింత అంధకారంగా మారిపోయింది.)

1వ ర: చూడు! కౌరవ నగరాన్నంతా
రాబందులు కప్పేశాయి.

2వ ర: అమ్మో! ఒంగు – ఒంగరా!
డాలు మాటున దాక్కో!
నరమాంసం తినే ఈ రాబందులు

అమ్మో! ఆకలిగా ఉన్నట్టున్నాయి.

(వెలుగు క్రమంగా ఎక్కువవుతూ ఉంటుంది.)

1వ ర: చూశావా! చూశావా! అవి కురుక్షేత్రం వైపు
వెళ్ళడం నువు చూశావా?

(తుఫాను ధ్వని నెమ్మదిస్తుంది.)

2వ ర: మృత్యువు మనమీదికి ఎగిరి వెళ్ళినట్టుంది.

1వ ర: చాలా భయంకరమైన అపశకునం.
ఏమవుతుందో ఏమో?
తెలియకుండా ఉంది.
రేపు ఏం జరుగుతుందో
ఈ నగరంలో

(విదురుడు వస్తాడు, ఎడం వైపునుంచి)

1వ ర: ఎవరది?

విదురుడు: నేను – విదురుణ్ణి
ధృతరాష్ట్రుడు చూశాడా?
చూశాడా ఈ భయంకర దృశ్యాన్ని?

1వ ర: వారెలా చూస్తారు? గుడ్డివారు కదా!
ఇప్పటిదాకా ఏం చూడగలిగారు కనక?

విదురుడు: నేనే ధృతరాష్ట్రుణ్ణి కలుస్తాను. తప్పదు.
చాలా భయంకరమైన అపశకునం.
సంజయుడేం సమాచారం తెచ్చాడో, ఏమో?

(రక్షకభటులు వెళ్ళిపోతారు. విదురుడు అలాగే చింతాక్రాంతుడై నిలబడి ఉంటాడు. వెనక తెర తొలుగుతుంది.)

కురుక్షేత్ర రణం నుంచి –

## కథాగానం

(పరదా లేవగానే అంత:పురం దర్భలు పరిచిన సామాన్యమైన బల్లమీద గాంధారి. ఓ చిన్న సింహాసనం మీద చింతాతురుడైన ధృతరాష్ట్రుడు. విదురుడు వాళ్ళవైపు వెడతాడు.)

ధృత: ఎవరు? సంజయుడా?

విదురుడు: కాదు.....విదురుణ్ణి మహారాజా!
భయంతో కంపిస్తోంది

కౌరవ నగరమంతా.
పోగా మిగిలిన పదీపరకా మంది
రెప్ప వెయ్యకుండా సంజయుడి కోసం
ఎదురు చూస్తున్నారు.
(కొంచెంసేపు మహారాజు ఏమైనా మాట్లాడుతాడేమోనని ఎదురు చూస్తాడు.)

**విదురుడు:** మహారాజా! మెదలకుండా ఉన్నారేం?
మహారాణి గాంధారి కూడా మౌనంగానే ఉంది.

**ధృత:** విదురా! జీవితంలో మొట్టమొదటిసారి
సందేహం నన్ను భీతావహుణ్ణి చేస్తున్నది.

**విదురుడు:** సందేహమా? ఇప్పుడా?
మిమ్మల్ని ఇవాళ ఆవహించిన ఈ సందేహం
ఏనాడో – అందర్నీ కుదిపివేసింది ప్రభూ!

**ధృత:** ఇంతకు ముందెన్నడూ నాతో అనలేదే?

**విదురుడు:** భీష్ముడు చెప్పాడు. ద్రోణాచార్యులు చెప్పారు.
ఇదే అంత:పురానికి వచ్చిఔ
కృష్ణుడూ చెప్పాడు:
“మర్యాద నతిక్రమించవద్దు.
అదే జరిగితే.
పాదాల కింద అణగదొక్కిన
కొండచిలవలా
కౌరవవంశాన్ని చుట్టుముట్టి
ఎండిన పుల్లని విరిచినంత తేలికగా ముట్టుపెడుతుంది” – అని.

**ధృత:** నేను జన్మాంధుణ్ణని నీకు తెలియదా, విదురా?
ఈ సమాజపు కట్టుబాట్లని,
బయటి ప్రపంచంలో జరిగే
వాస్తవిక విషయాలలోని నిజానిజాలని
నేనెలా గ్రహించగలను?

**విదురుడు:** మీరు అంధులైనా
ప్రపంచాన్ని చదివారు కదా?

**ధృత:** కాని ఆ ప్రపంచం నా గుడ్డితనంలోనే
ఆవిర్భవించింది. నా వ్యక్తిగతమైన
వేదన మాత్రమే నాకు తెలుసు.
అదే నా ప్రపంచం.

ఇంద్రజాలపు మాయాసృష్టిలాగా
చుట్టూ దట్టమైన చీకట్లు.
ఆ చీకట్లో ఒక నల్లని బిందువు.
ఆ నల్లని బిందువే
నా మనస్సులోని అన్ని భావాలను –
స్నేహం, అసహ్యం, ఏవగింపు,
నీతి, ధర్మం – నా వ్యక్తిగతమైన
ఉద్వేగాలన్నీ తానే అయి
నడిపించింది.
అక్కడ నైతిక విలువల్ని కొలవడానికి
కొలబద్దేలేదు.
కౌరవుల జన్మకారకుణ్ణి నేను.
వాళ్ళేనా అంతిమసత్యం.
వాళ్ళను ప్రేమించడమే
నేనెరిగిన నీతి, న్యాయం, ధర్మం.
అదే నేనెరిగిన అంతిమసత్యం.

**విదురుడు:** మీరు అనుకునే ఆ అంతిమసత్యం
యుద్ధం మొదలైన మొదటి రోజునే
ఋజువైంది కదా!
అదే – కౌరవుల సైనికబలం
అబద్ధమూ, శక్తిహీనమూ – అని.
గడిచిన పదిహేడురోజులనుంచీ
ఒక్కొక్కరే! ఒక్కొక్కరే!
వంశమంతా నాశనమవుతున్నా
వైనం మీరు వింటూనే ఉన్నారుగదా!

**ధృత:** ఆ వైనాలతో నాకు పనిలేదు.
నేను జన్మాంధుణ్ణి.
వినగలను. అంతే!
సంజయుడు కేవలం నాకు
కొన్ని కొన్ని మాటలు చెబుతాడు.
ఆ మాటల్ని చిత్రాలుగా
రూపుదిద్దుతాడు.......
అవి నాకు అపరిచితాలు.

దెబ్బతిన్న దుశ్శాసనుడి
గుండెనుంచి
పొంగిపొర్లుతున్న రక్తాన్ని
క్రూరుడైన భీముడు తన
దోసిళ్ళతో నింపుకుని
పెదవులు తడుపుకుంటున్న దృశ్యాల్ని
నేను ఊహించుకోలేను.

**గాంధారి:** (చెవులు మూసుకుని)
మహారాజా! చెప్పినవే
మళ్ళీమళ్ళీ చెప్పకండి.
సహించలేను.

(క్షణం సేపు అందరూ నిశ్శబ్దం.)

**ధృత:** ఇవాళే తెలిసింది నాకు.
నిజం – నావ్యక్తిగతమైన
హద్దుల కవతల ఉందని.
హఠాత్తుగా చెలియలి కట్ట
విరిగిపడ్డది.
కోటి కోటి యోజనాల దాకా
గర్జిస్తున్న సముద్రం.
సీమితమైన నా ప్రపంచాన్ని
విషయవాసనల అలలు
మింగివెయ్యడానికి
నా అంతరంగంలో
తిష్టవేసుకును కూర్చున్నాయని
ఇవాళే తెలిసింది నాకు
ఈ అలల తాకిడికి
అన్నీ కొట్టుకుపోయాయి.
నా వ్యక్తిగతమైన విలువలు
నేను స్థిరీకరించుకున్న నమ్మకాలు
అన్నీ – వమ్మయిపోయాయి.

**విదురుడు:** ఈ బాధ, ఈ పరాజయం
మీకు తెచ్చిపెట్టిన జ్ఞానమే
మిమ్మల్ని దృఢచిత్తుల్ని చేస్తుంది ప్రభూ!

ధృత: కాని జ్ఞానం భయాన్నే ఇచ్చింది విదురా!
జీవితంలో మొట్టమొదటిసారిగా
నన్ను సందేహం చుట్టుముట్టింది.

విదురుడు: భయం వేస్తున్నదంటే –
జ్ఞానం సంపూర్ణంగా అలవడినట్టే!
ప్రభువు చెప్పలేదా?

"అర్పించని జ్ఞానం అసంపూర్ణం
మనోబుద్ధిని నాకర్పించు
భయం నుంచి విముక్తుడవౌతావు.
నువ్వు నన్నే పొందుతావు.
ఇందులో సందేహం లేదు" – అని

గాంధారి: (ఆవేశంగా)
సందేహం ఉంది.
ఎవరికి ఉన్నా లేకపోయినా
నాకుంది.
"మనోబుద్ధిని నాకర్పించు" అన్నాడతను.
తన మనోబుద్ధినంతా కోల్పోయిన అతనా –
ప్రతిక్షణమూ మర్యాదనతిక్రమించిన అతనా –
ఈ మాటలు చెప్పింది?

ధృత: ఊరడిల్లు, గాంధారీ, ఊరడిల్లు.
ఎవరినీ దూషించకు.
నేనంధుణ్ణి.............

గాంధారి: కాని నేనంధురాల్ని కాదే!
బయటి ప్రపంచం నాకు బాగా తెలుసు.
ధర్మం, నీతి, మర్యాదా – ఇవన్నీ
కేవలం ఆడంబరాలు మాత్రమే!
నేనది ఎప్పుడూ గమనిస్తూనే ఉన్నాను.
నిర్ణయం తీసుకునే క్షణాల్లో
వివేకమూ, మర్యాదా అనేవి
వ్యర్థమని రుజువవుతూనే ఉంది, ఎప్పుడూ.
మనందరి మనస్సుల్లో ఓ
అంధకార గహ్వరం ఉంది.
ఆ చీకటి గుహలో

ఆటవికత, అంధపాశవికత
రాజ్యం చేస్తూ ఉంటాయి.
మన వివేకం, నైతికత, మర్యాద, అనాశక్తి
ఇవన్నీ "కృష్ణార్పణం" ఇవన్నీ -
మన అంధప్రవృత్తుల్ని దాచుకోవడానికి
మనం కప్పుకునే చిరుగుల బొంతలే!
చూడ్డానికి వీలుగా
కత్తిరించిన గుడ్డముక్కల్ని
కళ్ళమేరకు కుట్టుకుంటాం.
నాకీ అబద్ధాల ఆడంబరాలంటే
అసహ్యం.  అందుకే నేను కావాలనే
నా కళ్ళకు గంతలు కట్టుకున్నాను.

**విదురుడు:** చాలా కటువుగా మారావమ్మ నువ్వు.
పుత్రశోకం నిన్ను లోలోపల
పీల్చిపిప్పి చేస్తోంది.
నువ్వే దుర్యోధునుడితో అన్నావుగా -

**గాంధారి:** అన్నాను. "ధర్మం ఉన్న చోటో
జయం కలుగుతుందని" అన్నాను.
ధర్మం ఏ ఒక్కరి పక్షాన లేదు.
అందరూ అంధప్రవృత్తులతో
నడిచినవారే!
నువ్వు "ప్రభువు" - అంటావే -
అతడు - నయవంచకుడు.
కావలసినప్పుడల్లా మర్యాదని
తన కనుగుణంగా మలుచుకున్న
వంచకుడు.

**ధృత:** శాంతించు గాంధారీ!

**విదురుడు:** కటు నిరాశకి
పరాకాష్ట ఇది.
క్షమించు ప్రభూ!
ఈ కాఠిన్యంతో నిండిన
అపనమ్మకాన్ని కూడా
నీ పాదాల ముందే ఉండనీ......

స్వీకరించు ప్రభూ!
పుత్రశోకంతో కుమిలే
తల్లి గాంధారిని క్షమించు.

గాంధారి: "తల్లీ" అనొద్దు నన్ను.
నువ్వు "ప్రభువు" అంటావే –
అతనూ నన్ను "తల్లీ" –
అనే అన్నాడు.
ఆ రెండక్షరాలు మండుతున్న
ఇనప కణికల్లా
నా బొమికల్ని కూడా కాల్చేస్తున్నాయి.
పదిహేడు రోజుల్లో
నా కొడుకులందరూ – ఒక్కొక్కరూ
మరిణించారు.
నీ ఈ చేతులతో
కుసుమ కోమలులైన
నా కోడళ్ళ ముంజేతి గాజుల్ని
ముక్కలు చేశాను.
నా యీ కొంగుతో వాళ్ళ నొసటి
కుంకుమ రేఖల్ని చెరిపివేశాను.

(నేపథ్యంలో) – జయము జయము మహారాజులకు
దుర్యోధనుల వారికి జయం
గాంధారీ మాతకు జయం
శుభం కలుగుతుంది.
మహారాజు ధృతరాష్ట్రులవారికి – జయం, జయం)

ధృత: చూడు చూడు విదురా!
సంజయుడు వచ్చాడేమో చూడు.

గాంధారి: విజయం సాధించాడు.
నా పుత్రుడు దుర్యోధనుడే గెలిచాడు.
నే చెప్పలా? తప్పకుండా
దుర్యోధనుడే గెలుస్తాడని....

(రక్షకభటుడు వస్తాడు)

రక్ష: ఎవరో యాచకుడు తమ దర్శనానికి వచ్చాడు ప్రభూ!

విదురుడు: యాచకుడా?

ఎత్తయిన నుదురు
తెల్లగా పండిన జుట్టు
ఆజానుబాహువు – ?

**యాచకుడు:** అబద్ధమని రుజువైన భవిష్యత్తును
కౌరవనగరంలో నక్షత్రాల నడవడిని బేరీజు వేసి
మానవుడి కనిపించని
అదృష్టపు అక్షరాలను పరీక్షించాను.
నేను దూరదేశపు జ్యోతిష్యుణ్ణి.

**ధృత:** గుర్తొస్తోంది నాకు.......
మీరు–సంఘర్షణ తప్పని సరి అన్నారు కదూ!
కౌరవులు జయిస్తారని కూడా చెప్పారు.

**యాచకుడు:** అవును. అలా చెప్పినవాణ్ణి నేనే!
నేడు – నా విజ్ఞానమంతా మిధ్య అని
తేలిపోయింది.
ఒక్క ఉదటున – నక్షత్రాల గతికంటే
అతిశక్తివంతమైన ఓ వ్యక్తి – ఒక్క ఉదటున
వచ్చిపడ్డాడు.
అతడు – రణభూమిలో విషాదంగా ఉన్న అర్జునుడితో
అన్నాడు:

> "నేను పరాత్పరుణ్ణి
> చెప్పింది చెయ్యి.
> నిజం గెలుస్తుంది.
> నానుంచి సత్యాన్ని గ్రహించు.
> దేనికీ వెరవద్దు" – అని.

**విదురుడు:** ఆయనే! భగవంతుడు! ప్రభువు!!

**గాంధారి:** ఎన్నటికీ కాదు.

**విదురుడు:** చరిత్ర గమనం
నక్షత్రాల గమనం
దైవశక్తి – అన్నీ ఆయనలోనే
నిక్షిప్తం అయివున్నాయి.

**యాచకుడు:** ఏమో తెలియదు.
ప్రభువవునో, కాదో తెలియదు.
ఎవరైనా సరే–

అనాశక్తుడైనవాడు
ఇతిహాసాన్ని కవ్విస్తే
అప్పుడు నక్షత్రాల గతి తారుమారవుతుంది.
ఇదివరకే నిర్ణయించిన నియతి, నియమాలుండవు –
అని ఆరోజే రుజువయింది.
అయితే –
వాటిని కూడా మానవ నిర్ణయం
ఔనని ఆమోదించనూ వచ్చు
కాదని నాశనమూ చెయ్యొచ్చు.

**గాంధారి:** ప్రతీహారీ! ఈయనకి
దోసిలినిండా నాణాలు ఇవ్వు.
నువ్వు "దుర్యోధనుల వారికి జయం"
అన్నావు. అందుకే.

**యాచకుడు:** నేను అబద్ధపు భవిష్యత్తును మాత్రమే
ఈ వర్తమానంలో నా మాటకి విలువలేదు.
నా వంటి అబద్ధపు జ్యోతిష్యులెందరో!
చెదిరిన స్వప్నాలు
కరిగిపోయిన స్వభావాలు
ఈ కౌరవ వీధుల్లో
సందుసందునా వెదజల్ల బడ్డాయి.
తల్లి గాంధారి వీటన్నింటినీ
మమతతో పోషిస్తోంది.

(ప్రతీహారి నాణాలు తీసుకువచ్చి యాచకుడికి ఇస్తాడు.)

**యాచకుడు:** జయము జయము
దుర్యోధనుల వారికి
జయము జయము
గాంధారీ మాతకు (వెళ్ళిపోతాడు)

**గాంధారి:** జయం తప్పక కలుగుతుంది.
నా ఆశ గుడ్డిదే కావచ్చు.
అయినా దుర్యోధనుడు గెలుస్తాడు.

(మరో ప్రతీహారి వచ్చి దీపం వెలిగిస్తాడు.)

**విదురుడు:** చీకట్లు కమ్ముకున్నాయి.

**ధృత:** అయినా సంజయుడు రాలేదు.

తిరిగి వెళ్ళిపోయి వుంటాడు.
వీరులందరూ శిబిరాల్లో
ఉండి ఉంటారు.
ఎవరు గెలిచరో?
ఎవరు ఓడారో?

విదురుడు: సందేహించకండి, మహారాజా.
సంజయుడు తెచ్చేవార్త
సంతోషాన్నే కలిగిస్తుంది.
తల్లీ! విశ్రాంతి తీసుకోండి.
నగర ద్వారాలు రెప్పవెయ్యకుండా
సంజయుడి రాకకోసం
ఎదురుచూస్తున్నాయి.

(ఒకవైపు విదురుడూ, రెండోవైపు ధృతరాష్ట్రుడు, గాంధారీ వెళ్ళిపోతారు. రక్షకభటులు మళ్ళీ రంగస్థలం మీదికి వస్తారు.)

1వ ర: మర్యాద!
2వ ర: అపనమ్మకం!!
1వ ర: పుత్రశోకం!
2వ ర: భవిష్యత్తు!!
1వ ర: ఇవన్నీ రాజుల జీవితాలకి
అలంకారాలే!
2వ ర: ప్రభుత వీటన్నింటికీ
బాధ్యత వహించాలిసిందే!
1వ ర: కాని మన జీవితాలే! ఈ ఖాళీ సందుల్లో
శూన్యంగా గడిచిపోయాయి.
2వ ర: దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు?
1వ ర: మనమేం మర్యాదని అతిక్రమించలేదు.
అదంటూ మనకొకటి ఉంటేగా!
2వ ర: మనల్ని అపనమ్మకాలు ఎన్నడూ తాపులు తన్నలేదు.
ఎందుకంటే – మనం అంతటి నమ్మకాలు పెట్టుకోలేదు కనుక.
1వ ర: దు:ఖాన్ని అనుభవించలేదు.
2వ ర: బాధ అంటే తెలియదు.
1వ ర: శూన్యమైన ఈ సందుగొందుల్లోనే
మన జీవితాలూ గడిచిపోయాయి.

2వ ర: మనం సేవకులం కావడమే అందుకు కారణం.

1వ ర: గుడ్డి ప్రభువుల ఆజ్ఞలను పాలించడం తప్ప
మనకింకేం తెలుసు?

2వ ర: మనకంటూ ఓ అభిప్రాయం లేదు.
మనం స్వయంగా తీసుకునే
నిర్ణయాలు లేవు.

1వ ర: అందుకే, శూన్యమైన సందుల్లో
ఏ లక్ష్యమూ, లేకుండా
మనం కుడినుంచి ఎడమకు
ఎడమనుంచి కుడికీ
నడుస్తూనే ఉంటాం.

2వ ర: చచ్చాక కూడా యమలోకపు వీధుల్లో
కుడినుంచి ఎడమకి
ఎడమనుంచి కుడికి
తిరుగుతూనే ఉంటాం.

(నెమ్మదిగా వెళ్ళిపోతారు....రంగస్థలం మీద చీకటి. నెమ్మది నెమ్మదిగా తెరపడుతూ వుండగా) ఇవాళోరేపో –

**కథాగానం**

# రెండో అంకం

## పశోదయం

### శబ్ద శిల్పి ఈ సంజయుడు –

**కథాగానం**

(తెరలేస్తూనే అడవికి వెళ్ళేత్రోవ, ఎవరో వీరుడు, పక్కలో ఆయుధాలు పెట్టుకుని, ఉత్తరీయంతో మొహం కప్పుకుని నిద్రపోతున్నాడు.)

(సంజయుడి ప్రవేశం)

**సంజయుడు:** దోవతప్పినట్టున్నాను.
కంటకావృతమైన ఈవనంలోకి ఎట్లా వచ్చాను?
హస్తినాపురం ఎంతదూరంలో ఉందో?
నేనక్కడికి చేరడం ఎలా?

వెళ్ళి, ఏం చెప్పను?
ఈ లజ్జాకరమైన పరాజయం తరువాత కూడా
నేను బావున్నాననా?
ఎలా చెప్పను?
ఇవాళ కూడా శబ్దాలకేం కొదవలేదు.
నేనేవాళ్ళకి చెప్పాను
యుద్ధంలో ఏమేం జరిగిందో.
కాని, నేడీ అంతిమ పరాజయపు అనుభవం
సత్య స్వభావాన్నే మార్చేసింది.
ఇవాళ, అవే శబ్దాలు –
ఈ నూతన అనుభూతికి
ఎలా వాహకులవుతాయి?

(ఒక్క ఉదటున, పడుకున్న వీరుడు, "సంజయా" అంటూ లేస్తాడు.)

**సంజయుడు:** నన్నెవరో పేరుపెట్టి పిలుస్తున్నారు
కొంపతీసి ప్రేతాత్మలు కాదుగదా!
లేకపోతే ఇది నా భ్రమా?

**కృతవర్మ:** భయపడకు.
నేను – కృతవర్మను.
నువ్వు బ్రతికే ఉన్నావా, సంజయా?
పాండవ వీరులు
నిన్ను చంపలేదా?

**సంజయుడు:** నేనింకా బ్రతికే ఉన్నాను.
ఈ విశాల ధరిత్రి మీద అర్జునుడు
కౌరవ మొండాలను నరికి
కుప్పలుకుప్పలుగా పడేశారు.
కౌరవ వీరుల్లో బతికి
బయటపడ్డ వాడొక్కడూ లేడు.
సాత్యకి నన్ను చంపడానికి
అస్త్రాలు సంధించాడు.
నేను కూడా పోయివుంటూ బావుండేది.
ఎందుకో బ్రతికి బయటపడ్డాను.
అందుకేనేమో "సంజయుడు
అవధ్యుడన్నాడు" వ్యాసుడు.
ఆయన నాకిచ్చిన శాపం

నా మంచి కేనా?
"ప్రతి సంకట యుద్ధంలో
ప్రళయ భయంకర వేళలో
సంఘర్షణ లెన్ని జరిగినా
నువ్వు బ్రతికే వుంటావు – నిజం చెప్పడానికి."
అని శపించాడు.
ఆ అంధులతో
హా! ఇదంతా ఎలా చెప్పను?
సాత్యకి తళతళ మెరుస్తున్న
అస్త్రాన్ని సంధిచినప్పుడు
ఆ చల్లటి లోహ స్పర్శతో
మృత్యువు నాకు దగ్గరగా వచ్చింది.
అది నాకో సరికొత్త అనుభవం.
పదునైన బాణం తామరతూడును
పైనుంచి కిందిదాకా చీరేసినట్టు
ఆ చరమక్షణాల భయంతో
ఎవరో – నా అనుభూతులన్నింటినీ
చీరేసినట్టనిపించింది.
ఈ వికృతమైన అనుభూతితో
సంపూర్ణమైన నిజాన్ని
నేనెలా చెప్పగలను?

కృతవర్మ: సహనం – సంజయా!
సహనం వహించు.
నువ్వే – ఆ ఇద్దరికి
దుర్యోధనుడి పరాజయాన్ని గురించి చెప్పాలి.

సంజయుడు: ఎలా చెప్పను?
ఆ సామ్రాజ్యాధిపతి
ఒట్టి చేతులతో
పాదరక్షలు కూడాలేని కాళ్ళతో
రక్తంతో తడిసిన జీరాడే వస్త్రాలతో
విరిగిన రథం దగ్గర
అస్త్రశస్త్రాలేమీ లేకుండా
కంటికి కడివెడు నీళ్ళతో

నా వంక చూసి – తలదించుకున్నాడని
నేను వెళ్ళి వాళ్ళకు ఎలా చెప్పను? (వెడతాడు)

**కృతవర్మ:** సంజయుడు కూడా వెళ్ళిపోయాడు.
చాలా రోజులుగా ఏంజరుగుతుందని
విదురుడు చెబుతూ వచ్చాడో
అదే జరిగింది.

(నేపథ్యంలో "అశ్వత్థామా!" అన్న పిలుపు. కృతవర్మ చెవులొగ్గి వింటాడు.)

**కృతవర్మ:** ఇది వృద్ధుడైన కృపాచార్యుడి స్వరం.

(నేపథ్యంలో మళ్ళీ "అశ్వత్థామా!" అన్న పిలుపు వినవస్తుంది. కృతవర్మ "కృపాచార్యా......కృపాచార్యా..." అని పిలుస్తాడు. కృపాచార్యుడు వస్తాడు.)

**కృపా:** కృతవర్మా! నువ్వు బ్రతికే వున్నావా?

**కృతవర్మ:** ఆ! బ్రతికే వున్నాను.
అశ్వత్థామ బ్రతికే వున్నాడా?

**కృపా:** బ్రతికి వున్న వాళ్ళం మనముగ్గురమే!
రథం నుంచి దిగి తల వంచుకుని
దుర్యోధనుడు ఓటమిని స్వీకరించడం
అశ్వత్థామ చూశాడు.
వెనువెంటనే తన ధనుస్సును విరిచేశాడు.
ఆర్తనాదం చేస్తూ అరణ్యాల వైపుకు
ప్రయణం అయిపోయాడు.
అశ్వత్థామా!.........అశ్వత్థామా.........

(పిలుస్తూ వెడతాడు. ఎక్కడో దూరం నుంచి ఆ పిలుపు వినిపిస్తూ ఉంటుంది. వెనక తెర తీయగానే లోప అంతా చీకటి. కేవలం అశ్వత్థామ మీదే గోళాకారంలో వెలుగు ప్రసరిస్తుంది. విరిగిన ధనుస్సుతో కూర్చుని ఉంటాడు.)

**అశ్వత్థామ:** ఇది నా విరిగిన ధనుస్సు.
అశ్వత్థామ ధనుస్సు. గురు
ద్రోణుడు దీనినారిని స్వయంగా
సారించి నాకిచ్చాడు.
ఇవాళ నేను – నిరస్త్రుడై
దీనుగా – కన్నీరు కార్చే
దుర్యోధనుణ్ణి చూశాను.
అందుకే నా ధనుస్సును

ఈ ధనుస్సును - విరిచేశాను.
చావకొట్టిన పాములా
ఇది చాలా భయంకరంగా ఉంది.
నా మనసులాగే అదీ
శక్తిహీనమై పోయింది.....

ఏ బలంతో జీవించను
నేనిప్పుడు....

తండ్రి నిర్దాక్షిణ్యమైన హత్యని
భయనకమైన ఈ వనంలో కూడా
మరిచిపోలేక పోతున్నాను.
యుధిష్ఠిరుడు ఎలుగెత్తి చాటిన
"అశ్వత్థామ మరణించాడు"
అన్న మాటల్ని నేను మరువలేకుండా ఉన్నాను.
అస్త్ర సన్యాసం చేశాడు గురు-ద్రోణుడు-రణరంగంలోనే-
యుధిష్టిరుని మాటలమీద అచంచల విశ్వాసమున్న గురద్రోణుడు
అస్త్ర సన్యాసం చేయగానే
సమయం కోసం వేచివున్న ధృష్టద్యుమ్నుడు
ఖండఖండాలుగా ఆయన్ని నరికేశాడు.
నా తండ్రి అపరాజితుడని తెలుసు...
అదే మరుపుకు రావడం లేదు...
అర్థ సత్యంతో నా తండ్రిని
వధించాడా యుధిష్ఠిరుడు.

నాలో ఉన్న శుభ చింతన నీ
ఆర్ద్రమైన భావాలనీ
యుధిష్ఠిరుడి అర్థ సత్యం
ఆనాడే హత్య చేసింది.
ధర్మరాజు అయివుంటే -
"నరుడో, కుంజరమో" - అని పలికిన పలుకులు!
అతను మానవుణ్ణి పశువు నుంచి
వేరు చేయలేకపోయాడు.

ఆ రోజునుంచే నేను పశువు నయ్యాను.
అడవి మృగాన్నయినాను.
కాని –
నేను నేను దోవతప్పాను.
చీకటి గుహలోకి వచ్చాను.
ఓటమికి మారుపేరు ఈ చీకటి గుహ.
దుర్యోధనా! విను –
విను – ద్రోణాచార్యా – విను.
నేను – ఈ అశ్వత్థామను,
పిరికి అశ్వత్థామను,
మిగిలి ఉన్నాను.
రోగంతో చచ్చిన
శవం నోట్లోని కంపుకొట్టే కఫంలా – ఉమ్మిలా
మిగిలే ఉన్నాను...
నేడు నేను మిగిలే ఉన్నాను... (గుండెలు బాదుకుంటాడు.)

ఆత్మహత్యే శరణ్యమా?
ఈ నపుంసకత్వం నుంచి విముక్తి చెందడానికయినా?
నరకాగ్నిలో – మరుగుతున్న నరకాగ్నిలో – వేసి
యాతనలు పెట్టినా నాకింత బాధ
అనిపించేది కాదేమో?

(నేపథ్యంలో 'అశ్వత్థామా' అన్న పిలుపు)

కాని...హు...నేను బ్రతికే ఉంటాను.
కళ్ళులేని అడవి మృగంలా –
ధర్మరాజు మాటని నిజం చేస్తాను.
నా బొమికలనే రెండు పంజాలుగా చేసి
కంటికెవరు కన్పించినా మట్టి కరిపిస్తాను.
వథ...కేవలం వథ...అదే!
అదే నా ఉనికికి అర్థం!!

(ఎవరో వస్తున్న అలికిడి)

ఎవరో వస్తున్న అలికిడి
బహుశా: పాండవ వీరులెవరైనా అయివుంటే
ఆ...హా...(కసిగా) అదుగో –

ఒంటరిగా – అస్త్రశస్త్రాలేమీ లేకుండా
ఇటే వస్తున్నాడు.
ఇక్కడ దాగి.....వెనకనుంచి
వీడి మీద దాడి చేస్తాను.
ఆకలి గొన్న ఈ చేతులతో
ధనుస్సును విరిచిన ఈ చేతులతో
వాడి మెడలు విరిచేస్తాను.
దాక్కుంటాను....ఈ పొద వెనక.

(దాగి ఉంటాడు......సంజయుడి ప్రవేశం.)

**సంజయుడు:** అయినా మిగిలే ఉంటాను.
అయినా మిగిలే ఉంటాను.
కటుతరం అయిన నిజాన్ని
చెబుతాను...చెబుతాను.
కేవలం నిజం...కేవలం నిజం.
అదే ఆఖరి సత్యం....
నా –.......ఓహ్!.......

(అశ్వత్థామ సంజయుడి మీద దాడి చేస్తాడు. మెడ పిసికేస్తూ ఉంటాడు.)

**అశ్వత్థామ:** ఇలాగే.....ఇలాగే
నా ఆకలిగొన్న పంజా
యుధిష్ఠిరుడి గొంతు నులిమేస్తుంది.
"అశ్వత్థామ హతో హత:"
అన్నవాడి గొంతు నులిమేస్తుంది.

(కృతవర్మ, కృపాచార్యులు వస్తారు.)

**కృతవర్మ:** వదులు, అశ్వత్థామా, వదులు.
అతడు సంజయుడు.
పాండవుడు కాదు.

**అశ్వత్థామ:** కేవలం వథ....వథ...
కేవలం –

**కృపా:** కృతవర్మా! వెనకనుంచి
ఒడిసిపట్టు అశ్వత్థామను.
వథా!....కాని శత్రువునే!
ఎటువంటి వీరుడవోయి అశ్వత్థామా!
సంజయుడవధ్యుడు; తటస్థుడు....

(కృతవర్మ బంధనాల నుంచి విడిపించుకునే ప్రయత్నం చేస్తూ)

**అశ్వత్థామ:** తటస్థుడా? మామా!
నేను వీరుణ్ణి కాను; అడవి మృగాన్ని.
ఈ 'తటస్థం' అన్న మాటకి
నా దృష్టిలో విలువలేదు.
విచక్షణా జ్ఞానంలేని
ఈ అడవి మృగం చెప్పే మాటలు వినండి:
నా పక్షాన పలకని వారెవరయినా సరే
వారు నా శత్రువులే!

**కృతవర్మ:** పిచ్చివాడివా యేం?
సంజయా, నీ దోవన నువ్వు వెళ్ళు.

**సంజయుడు:** వదలకు....వదలకు నన్ను...వధించు
ఆ అంధ దంపతులక నిజాన్ని చెప్పాలంటే
గుండె తరుక్కుపోతుంది.
అంతకంటే నువ్వు నన్ను చంపడమే
నాకు సుఖమనిపిస్తోంది.
నన్ను చంపి ముక్తుణ్ణి
చెయ్యమని ప్రార్థిస్తున్నాను.

(అశ్వత్థామ నిస్సహాయంగా కృపాచార్యుడి వంకి చూస్తాడు. అతని భుజాల మీద తల వాలుస్తాడు.)

**అశ్వత్థామ:** ఏం చెయ్యను మామా!
నేనేం చెయ్యనిప్పుడు?
చంపాలన్నది నా నీతి కానే కాదు.
ఇప్పుడది నా మనస్సును దహిస్తున్న
ఏకైక వాంఛ.
కాని ఎవర్ని చంపను?
ఎవరి మెడలు విరచను?
మామా!.....చెప్పు మామా!!

**కృపా:** నిరాశపడకు, అప్పుడే!

**కృతవర్మ:** చెయ్యవలసింది చాలా వుంది.
దుర్యోధనుడింకా జీవించే ఉన్నాడు.
పదండి. అందరం వెళ్ళి వెతుకుదాం.

**కృపా:** సంజయా! ఆయనెక్కడున్నాడో తెలుసానీకు?

**సంజయుడు:** ఆయనిప్పుడు సరోవరంలో

మాయా వరణంలో ఉన్నాడు.
నిశ్చల సరోవర జలాల్లో ఉన్నాడని
పాండవులకు తెలీదు.

**కృపా:** ఊరట చెందు అశ్వత్థామా!
వెళ్ళు...వెళ్ళి దుర్యోధనుడి
ఆదేశమేమిటో తెలుసుకో.
సంజయా! వెళ్ళి సరోవరం
దాకా ఇతన్ని పంపించు.

**కృతవర్మ:** ఎవరా వృద్ధుడు?

**కృపా:** పదండి....మనల్ని ఎవరూ చూడకమునుపే.

**అశ్వత్థామ:** (వెడుతూ) నేనేం చెయ్యను మామా?
నా ధనుస్సును కూడా విరిచేశానే!

(వాళ్ళు వెళ్ళిపోతారు. కొద్దిసేపు రంగస్థలం ఖాళీగా ఉంటుంది. తిరిగి యాచకుడి ప్రవేశం.)

**యాచకుడు:** ఎంతో దూరంనుంచి హస్తినాపురం నుంచి
వచ్చాను....వృద్ధుణ్ణి...ఏమీ కనిపించడంలేదు.
అయినా – ఇప్పుడే ఇక్కడ కొంతమంది
మనుషుల్ని చూశాను......
తల్లి గాంధారి ఇచ్చిన నాణాలు
నా దగ్గర సురక్షితంగా ఉన్నాయేమో చూస్తాను.
అమ్మయ్య! సురక్షితంగానే ఉన్నాయి.....
వాళ్ళతో నేను చెప్పాను:
ఇది అనివార్యం; అదీ అనివార్యం – అని
ఇదీ దానంతట అదే జరుగుతుంది
అదీ అట్లాగే జరుగుతుంది – అని
నేడు – ఈ పరాజయం వేళ
భవిష్యత్తు యొక్క అన్ని అనివార్యతలూ
అబద్ధమని రుజువయింది......
కేవలం కర్మే సత్యం.
మానవుడు చేసే పనిలోనే
అతని భవిష్యత్తు దాగి వుంది –
యుగయుగాల దాకా. (రొప్పుతాడు)
అందుకే – అయనన్నాడు:
అర్జునా! అస్త్రాలను చేపట్టు

భయాన్ని, సందేహాన్ని వదిలి
యుద్ధం చెయ్యి.
నిష్క్రియాత్మకంగా ఉండకు.
ఆచరణలోనే మానవుడు.
తన ఉనికిని సార్థకం చేసుకోవాలన్నాడు.

(క్రిందికి వంగి, ధనుస్సును చూచి, దాన్ని పైకెత్తి చూస్తూ)

ఎవరీ ధనుస్సు నిక్కడ వదిలారు?
మళ్ళీ ఏ అర్జునుడి మనస్సునో
విషాదం ఆవహించలేదు గదా?

**అశ్వత్థామ:** (వస్తూ) అది నాదే!
ఆ ధనుస్సు నాదే!

**యాచకుడు:** ఎవరది? అశ్వత్థామా?
జయము జయము అశ్వత్థామా!

**అశ్వత్థామ:** జయనాదాలు చెయ్యకు వృద్ధుడా!
నీ భవిష్యద్వాణి అబద్ధం అయినట్టే
నా ధనుస్సు వ్యర్థం అయిపోయింది.
నేనిప్పుడే దుర్యోధనుణ్ణి చూచివస్తున్నాను.
మణిఖచితమై, రాజోచితమైన
ఛత్రాల నీడన ఉండే ఆయన మస్తకం
ఇవాళ కల్మష జలాలను కప్పుకుంది.
నువ్వేమో – దుర్యోధనుడికి
జయం జయం – అంటావు!

**యాచకుడు:** ఇప్పుడూ అంటాను
జయము జయము
దుర్యోధన చక్రవర్తికి – అని.
వృద్ధుణ్ణి......అలిసి ఉన్నవాణ్ణి.
అయిన వెళ్ళి చెబుతాను –
దుర్యోధనా! ఇది నీకు ఓటమి కాదని........
ఓ కొత్త నిజం ఉదయించే
వేళ ఇదేనని –
అతనికి అబద్ధపు భవిష్యత్తు చెప్పాను.
ఇప్పుడు వెళ్ళి మళ్ళీ చెబుతాను:
వర్తమానం నుంచి విడదీయరానిది భవిష్యత్తని.

ఇంకా సమయం మించి పోలేదని.
చరిత్రను మార్చి వేసే శక్తి
ప్రతిక్షణానికీ ఉందని
ఇప్పుడే వెళ్ళి చెబుతాను...........(నెమ్మది నెమ్మదిగా వెడతాడు.)

**అశ్వత్థామ:** ఏం చెయ్యను నేను?
నేనేం చెయ్యనిప్పుడు?
యుధిష్ఠిరుడి సగం నిజం
నన్ను – నా భవిష్యత్తును
హత్య చేసింది.
వర్తమానంలో నేనూ – నా ప్రతీకారమూ.
........అందుకే జీవిస్తాను.
మొదటే నా జీవితంలో
నిశ్చితమైన భవిష్యత్తు లేదు.
ఉన్నా అది తటస్థమే!
ఆ తటస్థమే నా శత్రువు! (వృద్ధుడి వైపు వెడతాడు)
ఇవాళింక వాడిని రక్షించే వారెవరూ లేరు.
ఈ ఆకలిగొన్న పంజాలతో............
ఆగు.........ఆగు............
అబద్ధపు భవిష్యత్తు చెప్పిన
ఓ ముసలి యాచకుడా!........ఆగు......ఆగు...........

(పళ్ళు నూరుతూ పరుగెత్తుతాడు వింగ్‌లోకి......వృద్ధుడి గొంతు నులిమి లోపలికి ఈడ్చుకుపోతాడు.)

వధించడం...కేవలం వధించడం
అదే నా ధ్యేయం............అదే నా కర్తవ్యం.

(నేపథ్యంలో గొంతునులిమితో వచ్చే మూలుగు....అరుపులు......అశ్వత్థామ అట్టహాసం. రంగస్థలం మీద కేవలం రెండు వెలుగు వృత్తాలు నృత్యం చేస్తున్నట్లుంటాయి. కృపాచార్యుడు, కృతవర్మ రొప్పుతూ అశ్వత్థామను రంగస్థలం మీదకు పట్టుకొస్తారు........)

**కృపా:** ఏమిటి?.....నువ్వు చేసిందేమిటి అశ్వత్థామా?

**అశ్వత్థామ:** ఏమో తెలియదు.........నేనేం చేశానో నాకు తెలియదు.........నేనేమన్నా చేశానా?

**కృతవర్మ:** కృపాచార్యా! ఈ అశ్వత్థామను చూస్తే నాకు భయంవేస్తున్నది?

(కృపాచార్యుడు అశ్వత్థామను కూర్చోబెట్టి అతని నడుముకు కట్టివున్న ఛట్టీని వదులు చేస్తాడు. నుదుటి మీద చెమటను తుడుస్తాడు.)

**కృపా:** కూర్చో...........విశ్రాంతి తీసుకో.........

నువ్వేం చెయ్యలేదు........ఏదో చేసిన
భయంకరమైన కలని మాత్రమే చూశావు...........

**అశ్వత్థామ:** నేనేం చెయ్యను మామా! వధించడం
నా అభిమతం కాదు. అది ఒక మానసిక స్థితి.
ఈ హత్య తరువాత శరీరంలోని అణువణువూ
"ఇదేనా – అనాసక్తి అంటే?" అని అడుగుతున్నట్టు వుంది.

**కృపా:** (అశ్వత్థామను పడుకోబెట్టి)
పడుకో! నిద్రపో!
వెళ్ళి విశ్రాంతి తీసుకోమని
దుర్యోధనుడు చెప్పాడు.
పాండవులంతా రేపేం చేస్తారో చూద్దాం.
పక్కకి ఒత్తిగిలి పడుకో.............

(కృతవర్మతో) పడుకున్నాడు........

**కృతవర్మ:** (వ్యంగ్యంగా) ఆ! నిద్రపోయాడు......
ముసలివాళ్ళనీ, రక్షణలేని వాళ్ళనీ
దాగి దాగి చంపే వీరులం మనం!
అందుకే యుద్ధంలో చావకుండా మిగిలి ఉన్నాం!!

**కృపా:** శాంతించు కృతవర్మా!
వీరులన్నవారు ఏం చెయ్యలేదు? ఇప్పటిదాకా?
వాళ్ళు చెయ్యగలిగినంతా చేశారు –
ద్రోణుడు – అస్త్రసన్యాసం చేసినవాడు –
అయినా ధృష్టద్యుమ్నుడు వదిలాడా ఆయన్ని?
మనం? మనం మాత్రం?
నిరస్త్రుడూ, నిస్సహాయుడూ అయిన
అభిమన్యుణ్ణి వదిలామా?
ఏడుగురు మహారథులూ – !!

**అశ్వత్థామ:** (ఏదో గుర్తుకు వచ్చినట్టు)
నేనే చంపాను ఆ జ్యోతిష్యుణ్ణి.
భవిష్యత్తును చంపాలనుకున్నాను.
ఆ వృద్ధుడెలా మరణించి పడిఉన్నాడో నాకు తెలియదు.
మామా! నేనా వృద్ధుణ్ణి చంపలేదు.
నా మాటనమ్ము.........

**కృపా:** నిద్రపో. నిద్రో.......కృతవర్మా! నేనీ రాత్రికి కాపలా కాస్తాను.

(వాళ్ళు వెడతారు............తెర)

వరద తీసినట్టి గంగ

**కథాగానం**

# మూడో అంకం

## అశ్వత్థామ అర్థసత్యం

సంజయుడు వచ్చాడు నగరానికి

**కథాగానం**

(తెరతీసే సరికి కాపలావాడు నుంచుని ఉంటాడు. విదురుడి సహాయంతో ధృతరాష్ట్రుడు వస్తాడు.)

**ధృత:** చూడలేను.........చూడలేను కనుకే
అంగవికులురైన సైనికులను
చేతులతో తడిమి – చూడడానికి ప్రయత్నించాను.
భుజాలనుంచి చేతులు విరిగిపడిన స్పర్శ
నా సింహాసనం చేతికోడును జ్ఞాపకం చేస్తున్నది.

**విదురుడు:** ఇవా మీరు ఆలోచిస్తున్నది మహారాజా?

**ధృత:** ఇంతవరకు సంజయుడి మాటల్లో విన్నాను.
ఇప్పుడు అదే యుద్ధాన్ని చేతులతో
తడిమి చూస్తున్నాను........అంతే!

(అదే సమయంలో ఒక కుంటి–మూగ సైనికుడు దేక్కుంటూ వస్తాడు. విదురుడి పాదాలమీద పడి అతని దృష్టిని తనవైపుకు మళ్ళించుకుంటాడు. దోసిలిపట్టి నీళ్ళు ఇమ్మనట్లుగా సంజ్ఞ చేస్తాడు.)

**విదురుడు:** (ఉలిక్కిపడి) ఏమిటది?............(బాధగా) ఆ........ఆ.........ప్రతీహారీ! కాసిని నీళ్ళు తీసుకురా!

**ధృత:** ఎవరది విదురా?

**విదురుడు:** దప్పికగొన్న ఓ సైనికుడు మహారాజా!

(సైనికుడు తన మూగభాషలో ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తాడు.)

**ధృత:** ఏమంటాడు?

**విదురుడు:** ధృతరాష్ట్ర మహారాజుకు జయం – అంటున్నాడు.........
పాపం, మూగవాడు మహారాజా!

(ప్రతీహారి నీళ్ళు తెస్తాడు......మూగవాడు రొప్పుతూ ఉంటాడు.)

**ధృత:** ఈ మూగవాడు తప్ప నాకింతవరకెవ్వరూ జయం పలకలేదు.

(మూగవాడి నుదురు తాకి చూసిన ప్రతీహారి.)

ప్రతీహారి: జ్వరంవచ్చింది?

ధృత: నీళ్ళు తాగించావా?
ఇక్కడెక్కడన్నా విశ్రాంతి తీసుకోమని చెప్పు.

(మూగవాడు వెనక్కువెళ్ళి కళ్ళు మూసకు పడుకుంటాడు.)

గాంధారీదేవి నడిగి
ఇతనికి బట్టలు తెచ్చివ్వు.

ప్రతీహారి: గాంధారీ మహారాణీ ఇవాళ
దానగృహంలోకి రానేలేదు.

విదురుడు: ఆమె కళ్ళల్లో నీళ్ళు లేవు.
శోకం లేదు; కోపమూ లేదు.
ప్రాణం లేని శిలలా మెట్లమీద కూర్చుని ఉన్నారు.

(నేపథ్యంలో కోలాహలం)

ధృత: ప్రతీహారి! వెళ్ళిచూడు అదేమిటో!

(ప్రతీహారి వెడతాడు.)

విదురుడు: మీరు వెళ్ళి గాంధారీదేవిని ఓదార్చండి.

ధృత: వెడుతున్నాను. సంజయుడు కూడా అక్కడలేడు.
భీమ దుర్యోధనుల ద్వంద్వం యుద్ధ
సమాచారం ఏంతెస్తాడో ఏమో?

(గోల ఎక్కువవుతుంది.)

విదురుడు: మీరు వెళ్ళండి మహారాజా...........

(రెండవ ప్రతీహారి సహాయంతో ధృతరాష్ట్రుడు వెళ్ళిపోతాడు.)

ఏమిటీ కోలాహలం?

1వ ర: పట్టణమంతా ఒక్కసారిగి
భయోత్పాతం......

విదురుడు: ఎందుకు? ఏం జరిగింది?

1వ ర: ఓడిపోయి గాయపడ్డ
సైనికులతో పాటు
శత్రుపక్షం యోధుడొకడు
శస్త్రాస్త్రాలు ధరించి
రూపుకట్టిన రాక్షసుడిలా

నగరంలోకి వచ్చాడు.
అతడు నగరాన్ని కొల్లగొడతాడని
జనం చెప్పుకుంటున్నారు.

(రెండవ రక్షకభటుడు తిరిగివస్తాడు.)

విదురుడు: ఛీ......ఛీ........అదంతా అబద్ధం.
నేను స్వయంగా వెళ్ళి తెలుసుకుంటాను.
అంతవరకు మీరిక్కడే ఉండి
ప్రాసాద ద్వారాన్ని కాపలాకాయండి (వెడతాడు.)

2వ ర: నువ్వా వీరుణ్ణి నీ కళ్ళతో చూశావా?

1వ ర: మాయలమారి........నిత్యమూ రకరకాల
వేషాలు వేస్తాడట!
రక్షకగణాలు నగరద్వారాన్ని
బంధించి వేశాయి.
అప్పుడొక రాబందు వేషంలో
మూసివున్న నగర ద్వారాల మీదినుంచి
ఎగిరి వచ్చాడు.
మిద్దెలమీద పడుకుని ఉన్న
పిల్లల్ని తినసాగాడు.

2వ ర: త్వరగా దక్షిణ ద్వారాన్ని మూసెయ్.

1వ ర: (భయంతో) అటుచూడు.

2వ ర: ఏమిటది?

1వ ర: వాడొస్తున్నాడు.

2వ ర: దాక్కో.....దాక్కో......ఇటు దాక్కో..........

(ఇద్దరూ వెనకగా వెళ్ళి నక్కుతారు. ఒక వీరుడు సాధారణమైన సైన్యాధిపతి వేషంలో వస్తాడు.)

యుయుత్సుడు: ఏదో అవుతుందేమోనన్న భయంలో ఉన్న
బాధకంటే, నిజంగా భయపడడం
అంత బాధాకరం కాదు.
ప్రస్తుతం నా పరిస్థితి అదే!
ఈ రాజప్రాసాదం నా తల్లిదండ్రులదే!
కాని – విషపూరితమైన ఆయుధాలే
నాకు స్వాగతం ఇస్తాయేమో
ఎవరూ చెప్పగలరు?

1వ ర: ఈయన యుయుత్సుడు.

ధృతరాష్ట్రుని కుమారుడు.
యుద్ధంలో ధర్మరాజు
పక్షాన పోరాడాడు.

యుయు: సత్యాన్ని నమ్మడమే
నా అపరాధం కావచ్చు.
ద్రోణ–భీష్మాది మహారథులు కూడా
దుర్యోధనుడికి విరుద్ధంగా
వెళ్ళలేకపోయారు.
కాని నేను మాత్రం స్పష్టం చేశాను –
అసత్యం పక్షాన ఉండను – అని.
నేనూ కౌరవుణ్ణే –
అయినా నాకు కౌరవ వంశం కంటే
సత్యమే గొప్పది.

2వ ర: నిజంగా యుయుత్సుడే!
దెబ్బతిన్న సేనతో పాటు
తిరిగివచ్చినట్టున్నాడు.

యుయు: నేను కూడా దుర్యోధనుడి
విశృంఖలతను సహించివుంటే
ఇవ్వాళెవరూ నన్నింత
ఏవగించుకునే వారు కాదేమో!
యుద్ధంలో పరాజితుణ్ణి అయినా
తల్లి చేతులు చాచి నన్ను
కౌగిలించుకోనేదేమో?
నాకు ఆహ్వానం పలికేదేమో?

విదురుడు: (వస్తూ) యుయుత్సా!
నిన్నెప్పట్నుంచో ఎంతగా
వెదుకుతున్నానో తెలుసా?
వత్సా! నువ్వు తిరిగి రావడం
చాలా మంచిదయింది.
ప్రహరీ! వెళ్ళు.......వెళ్ళి గాంధారీ దేవికి చెప్పు.....
పుత్రశోకంతో మునిగివున్న గాంధారి
నిన్ను చూసి కొంత ఉపశమనం పొందవచ్చు.

యుయు: చెప్పలేం.......నా మొహమైనా చూస్తుందో లేదో!

విదురుడు: అలా అనకు.........కలుషితమైన కౌరవకథలో
తల ఎత్తుకు తిరగగలవాడివి నువ్వే!

యుయు: (వ్యంగ్యంగా నవ్వి)
అందుకేనా నన్ను చూడగానే జనం
తలుపులు మూసుకుంటున్నారు?
అందరూ నన్ను "మాయావి"నన్నారు.
రాక్షసుడన్నారు......రాబందులా
పిల్లల్ని పీక్కుతినే వాడినన్నారు.

విదురుడు: దానికి విచారించకు యుయుత్సా!
అజ్ఞానులు......భయోత్పాతంతో
కంపించి పోతున్న సాధారణ ప్రజలు
ఇలా అనుకోవడం మామూలే!
వాళ్ళుగీసుకున్న గిరికి భిన్నంగా మరేదైనా
జరిగితే – వాళ్ళు సహించలేరు.

(రెండవ రక్షకభటుని వెంట గాంధారి ప్రవేశం)

2వ ర: తల్లి గాంధారీదేవి వచ్చింది.

(ఓ క్షణం నిశ్శబ్దం.)

గాంధారి: (ఉపేక్షాభావంతో)
కుశలంగా ఉన్నాడేమో
అతనిని అడుగు విదురా!

(యుయుత్సుడు, విదురుడు మౌనంగా ఉంటారు.)

నాయనా! నీ బంధువులందర్నీ చంపి చంపి
నీ భుజాలు అలిసిపోలేదు కదా!

(నిశ్శబ్దం)

వైభవోపేతమైన పాండవుల శిబిరాలు చూశాక
నీకు ఈ పట్టణమంతా కళావిహీనంగా కన్పిస్తోంది కదూ?

(నిశ్శబ్దం)

మిన్న కున్నావేం నాయనా!
అలసిపోయుంటావు.
విదురా! ఇతనికి
పూలశయ్య ఏర్పాటుచెయ్యి

సరోవరంలో బురదలో పడుకోడానికి
ఇతను దుర్యోధనుడు కాదుగదా!

(నిశ్శబ్దం)

నీవూ మౌనంగా ఉన్నావేం విదురా?
నేనితని శత్రువుల తల్లిననా?

(వెళ్ళబోతుంది)

ప్రహరీ, పద........

**విదురుడు:** ఇది నీకు భావ్యం కాదు, తల్లీ!

(ఆగకుండా వెళ్ళిపోతుంది.)

**యుయు:** అమ్మ........అమ్మమిటి
ఇలా చేసింది విదురా! (తల వంచుకు కూర్చుంటాడు)
అబద్ధంతో రాజీపడితేనే
బాగుండేదేమో!

**విదురుడు:** సమస్యకు అది సమాధానం
ఎంతమాత్రమూ కాదు యుయుత్సా!
అబద్ధంతో రాజీపడితే
లోలోపల కుళ్ళిపోయేవాడివి.
శిధిలమయ్యే వాడివి.

**యుయు:** అమ్మ కాఠిన్యం, ప్రజల ఏవగింపు –
ఇవన్నీ నాకు మనస్థయిర్యాన్ని ఇస్తాయంటారా?
సత్యాన్ని సమర్థించినా అసత్యాన్ని సమర్థించినా
పరిణామం ఒక్కటే అనిపిస్తుంది.
ఆ రెండూ మనస్సును శిధిలం చేస్తాయి.
దీనికి పర్యవసానంగా నేనేం పొందాను?
నేనేం పొందాను?

**విదురుడు:** శాంతించు నాయనా! ఓర్చుకో........
తీవ్రమైన బాధని అంతతీవ్రంగానూ
భరించడం నేర్చుకో –

(ఇంతకు ముందు కళ్ళు మూసుకుని పడుకున్న మూగవాడి రొప్పు ఉన్నట్టుండి పెద్దగా వినిపిస్తుంది.)

**1వ ర:** ఏమిటీ ఆర్తనాదం?
బహుశా: ఈ మూగవాడు
ప్రాణాలు వదిలాడేమో?

(2వ రక్షకభటుడు వెడతాడు.)

విదురుడు: యుయుత్సా.....అతనికి నీళ్ళివ్వు
స్నేహాన్నివ్వు.......కష్టాలని సహించు....
మరణించే వాళ్ళకి కాస్తంత జీవితాన్నివ్వు.

యుయు: (మూగవాడి దగ్గరకు వెళ్ళి)
ఒళ్ళో తలపెట్టుకో......నోరుతెరు..........
ఆ......అది.....కళ్ళుతెరు –

(మూగవాడు కళ్ళుతెరిచి నీళ్ళు తాగుతూ వుంటాడు. ఉన్నట్టుండి అరుస్తాడు....పడుతూ, లేస్తూ దేక్కుంటూ పారిపోతాడు.)

2వ ర: ఇదేమిటి?

యుయు: అపరాధిని నేనే!
కౌరవసేనలోని అశ్వారోహి ఇతను
నా అగ్ని బాణాలతో
ఇతని కాళ్ళు కమిలిపోయాయి.
నా వల్ల తీవ్రమైన నష్టానికి కష్టానికి
గురయినవాడు – నా కరుణని, జాలిని స్వీకరిస్తాడా?
నేను స్నేహాన్ని పంచి ఇద్దామన్నా
అది ఇతరులకు అంగీకారం కావద్దా?
కృష్ణుడెటు ఉంటే అటు జయం
కలుగుతుందని వ్యాసుడన్నాడు.
ఇది నిజంగా కృష్ణుడి జయమే!
కాని నేను – నేను వేటగాణ్ణి.
మాతృ వంచితుణ్ణి.
అందరి అసహ్యానికి గురైన వాణ్ణి.

విదురుడు: నేటి–నీ పరాజయ సేవలో
ఎక్కడో ఏదో అసత్యం ధ్వనిస్తున్నది.
ఒక్కొక్కరూ ఇరుసుమీది నుంచి
కిందికి దిగిపోయారు.
చక్రాలు – ఒక్కొక్కటిగా – ఊడిపోయాయి.
ఈ అందరిలోనూ ఎందుకూ పనికిరాని
ఇరుసువి – నువ్వు!.........నువ్వేనా ప్రభూ!!

(ఉన్నట్టుండి అంత:పురం నుంచి ఆర్తనాదం వినవస్తుంది.)

యుయు: ఏమిటా ఆర్తనాదం?

విదురుడు: ప్రహారి!.....వెళ్ళిచూసిరా!.........

(1వ రక్షకభటుడు వెంటనే వచ్చేస్తాడు)

1వ ర: సంజయులవారు సమాచారం తెచ్చారు.

విదురుడు: ఏమిటది

యుయు: "

1వ ర: ద్వంద్వ యుద్ధంలో.........దుర్యోధన....
మహారాజు.........పరాజితులై......నారు......

(విదురుడు, యుయుత్సుడు గబగబా వెళ్ళిపోతారు. అంత:పురంనుంచి ఆర్తనాదాలెక్కువ అవుతాయి. దుర్యోధన చక్రవర్తి ఓడిపోయారనే ప్రకటన లోపలనుంచి వినిపిస్తుంది. వెనక తెరలేస్తుంది.......పాండవుల హర్షధ్వని, జయజయ ధ్వానాలు ఎక్కువవుతాయి...అడవి మార్గం కనిపించే దృశ్యం......ధనుస్సులు ఎక్కుపెట్టి కృతవర్మ, కృపాచార్యులు పరిగెత్తుక వస్తారు.)

కృతవర్మ: ఇక్కడే! ఇక్కడే దాక్కో...
కృపాచార్యా! శంఖాన్ని పూరిస్తూ
విజయలక్ష్మి వరించిన పాండవులు
ఇటే వస్తున్నారు...తమ శిబిరాల వైపుకు.

కృపా: ఆగు....ధనుస్సును ఎక్కుపెట్టు....
ఎవరు?....ఎవరా వచ్చేది?

కృతవర్మ: అశ్వత్థామ.....మారువేషంలో – ఉన్నాడు.
దుర్యోధునుడు భీముడు యుద్ధం చేస్తుంటే
చూడడానికి వెళ్ళాడు...

అశ్వత్థామ: మామా! విను. అధర్మ యుద్ధంలో
దుర్యోధనుడు ఓడిపోయాడు.

కృపా: (మాట్లడవద్దని సంజ్ఞ చేస్తూ)
దాక్కో. పాండవులను విడిచి బలరాముడు
కోపంతో ఇటే వస్తున్నాడు.

కృతవర్మ: (నేపథ్యం వంక చూసి) కృష్ణుడు కూడా ఉన్నాడు ఆయనతో.

కృపా: వినండి – సరిగ్గా వినండి.

(కేవలం నేపథ్యం నుంచే వినవస్తుంది.)

బలరాముడు: లేదు......లేదు......లేదు.
నువ్వేమయినా చెప్పు కృష్ణా!
తప్పకుండా భీముడేదో
అన్యాయం చేశాడీ వేళ.

అతని యుద్ధం అధర్మం. అనుచితం.

కృపా: కృష్ణుడేమని నచ్చ చెప్పడానికి చూస్తున్నాడో!

(తిరిగి నేపథ్యంనుంచి)

బలరాముడు: పాండవులు అయినా వాళ్ళూ,
కౌరవులు కాని వాళ్ళూనా?
నేనివాళ చెప్పేవాణ్ణి భీముడికి
కాని - నువ్వే ఆపావు.
చిన్నప్పటి నుంచీ నువ్వు నాకు తెలుసు.
మొదటినుంచీ -
మర్యాదా, మన్ననా లేదు.
పైగా కూటనీతి, కుటిల నీతి!!

కృపా: (ధనుస్సు కిందపెడుతూ) అటు వెళ్ళారు ఇద్దరూ!

(నేపథ్యంలో మాటలు దూరం అవుతున్నట్లుగా వినిపిస్తూ ఉంటుంది.)

బలరాముడు: హస్తినాపురం వెళ్ళు. గాంధారిని ఓదార్చు.
అన్నీ విప్పి చెప్పు........ఏమైనా చెయ్.....
కాని నేను ఒక విషయం చెబుతాను విను.
నీ అధికారం - కూటనీతి -
ఎన్ని ప్రయోగించినా
శంఖ ధ్వని చేస్తూ తమ తమ శిబిరాలకు వెళ్ళే
ఈ పాండవులు అధర్మయుద్ధంలోనే మరణిస్తారు.

అశ్వత్థామ: (అవే మాటల్ని తిరిగి అంటూ)
అవును. అధర్మయుద్ధంలోనే
మరణిస్తారు వాళ్ళు.

కృపా: ఏమంటున్నావు వత్సా?

అశ్వత్థామ: వాళ్ళు కూడా అధర్మయుద్ధంలోనే మరణిస్తారు.
నేను ఆలోచించాను, మామా
ఆలోచించాను.
వాళ్ళని నేను చంపుతాను.
అశ్వత్థామే ఆ నీచుల్ని చంపుతాడు.

కృతవర్మ: (వ్యంగ్యంగా) ముసలి యాచకుణ్ణి చంపినట్టా?

అశ్వత్థామ: (చిరాకుగా) ఆ......అట్లాగే! సరిగ్గా అట్లాగే -
పాండవ వంశాన్ని నిర్మూలించే దాకా -

కృతవర్మ: కాని, అశ్వత్థామా! పాండవులు
వృద్ధులు కారయ్యా! నిరస్త్రులూకారు.
ఒంటరి వారంతకన్న కారు.
సిగ్గుపడవలసిన ఈ యుద్ధం
ముగిసింది కదా! అధర్మంతో నువ్వు
చేద్దామనుకునే యుద్ధాన్ని మరి ఎవరిమీదనైనా
ప్రయోగించవయ్యా వీరుడా!

అశ్వత్థామ: దానికి కూడా సన్నద్ధుడనవుతున్నాను, కృతవర్మా!
వ్యంగ్యంగా మాట్లాడకు......
ధనుర్బాణాలు ధరించు
ముందు పాండవుల హితైషివైన నిన్ను చంపుతాను.

కృపా: (నివారిస్తూ) అశ్వత్థామా! పక్కన పెట్టు
నీ శస్త్రాస్త్రాలని. పిచ్చివాడివైనావా యేం?
కాస్తయినా మర్యాద, మన్ననా
మిగిలిఉన్నట్లు కనిపించడంలేదే!

అశ్వత్థామా: వింటున్నావా తండ్రీ!
ఈ ప్రతీకార చర్యలో నేను
ఒంటరివాణ్ణేనని నాకు తెలుసు.
తండ్రీ! ద్రోణాచార్యా!
నిన్ను అధర్మంగా చంపాడు ధృష్టద్యుమ్నుడు.
దుర్యోధనుణ్ణీ అలాగే చంపాడు ధూర్తుడు భీముడు.
ప్రపంచంలో ఎవ్వరికీ అక్కర్లేని మర్యాదని
అనాథ అయిన ఈ అశ్వత్థామ ఒక్కడే ఎందుకు పాటించాలి?

కృపా: కూర్చో......ఇటుకూర్చో నాయనా!
మేమంతా ఈ ప్రతీకారచర్యలో
నీతోనే ఉన్నాం.
కాని – దాక్కుని, మోసపూరితంగా
యుద్ధం చేయడం కంటే వేరే మార్గం ఆలోచించు.

అశ్వత్థామ: వేరేమార్గమా? పాండవులు వేరే మార్గాన్ని దేనినైనా వదిలిపెట్టారా?
పాండవుల మర్యాద ఇవ్వాళ ద్వంద్వ యుద్ధంలో చూశాను.
ఎంత అధర్మంగా పడగొట్టాడు భీముడు దుర్యోధనుణ్ణి!
దుర్యోధనుడి విరిగిన తొడలమీద
బాహువులమీద, నుదుటి మీద –

తన బరువును మోపి, చేతులు చాచి
పశువులా, భీకరంగా గర్జించాడు – భీముడు.
దుర్యోధనుడి కణతల మీది నరాలు
ఉన్నట్టుండి పొంగి చిట్లిపోయాయి.
పెదవులు చీరుకు పోయాయి.
జఘనాలు విరిగిన చప్పుడు
హృదయవికారంగా
ధ్వనించాయి.
మూసుకపోతున్న కళ్ళతో
తన ప్రజల్ని ఆఖరుసారి చూసుకున్నాడు
దుర్యోధనుడు............

కృపా: చాలు......చాలు.....ఇంక ఆపు అశ్వత్థామా
బహుశా: నువు చెప్పిన మార్గం తప్ప
మరోమార్గం గోచరించడంలేదు.

అశ్వత్థామ: మామా! ప్రమాణం చేసి చెప్పు....త్వరగా –
ఆలస్యం చెయ్యొద్దు. బహుశా: ఇంకా
జీవించే ఉంటాడు దుర్యోధనుడు.
అతని సమక్షంలో నిన్ను సేనాపతిగా
ప్రకటించుకో!
తరువాత చెబుతాను నేను.

కృపా: పద, కృతవర్మా....నువ్వూ నడు......

కృతవర్మ: ఉహూ! నన్ను వదిలెయ్యండి......మీరు వెళ్ళండి.

(కృపాచార్యుడు, అశ్వత్థామా వెళ్ళిపోతారు.)

వెళ్ళిపోయారు వారిద్దరూ.
నేనేమీ పిరికివాణ్ణి కాదు.
దుర్యోధనుడి హత్యకు
నాలోనూ రక్తం పొంగుతోంది.
కాని – ఎంత భీభత్సం?
శరీరంలో ప్రతి ఎముకా విరిగిన
దుర్యోధనుడు – ఈ పిచ్చివాణ్ణి
సేనాపతిగా నియమిస్తాడా?
తన సేనలో మిగిలిన వారిద్దరే!
ముసలి కృపాచార్యుడు – పిరికి కృతవర్మ!

ఆక్షేషిణి కౌరవసేనకు
మిగిలిన వాళ్ళిద్దరు!
పోనీ, కృతవర్మా!
దుర్యోధనుడి పక్షాన ఉండదలుచుకుంటే
తుదివరకు ఆ నిశ్చయంతోనే ఉండు.

(ఒంటరిగా కృపాచార్యుడు వస్తాడు.)

వచ్చేశారా, కృపాచార్యా?

కృపా: ఎంతోసేపు చూడలేకపోయాను.
ఆ భయానక దృశ్యాల్ని.
చెట్టు తొర్రలోంచి రెండు రాబందులు
పొంచి చూస్తున్నాయి.
ఈ పొదలోనుంచి ఆ పొదలోకి
ఆ పొదలోనుంచి ఈ పొదలోకి
నక్కలు, తోడేళ్ళు, – నాలుకలు చాచి
ఆశగొలిపే కళ్ళతో, రెప్పవెయ్యకుండా
దుర్యోధన చక్రవర్తిని చూస్తూ
అటూ ఇటూ తిరుగుతున్నాయి.

కృతవర్మ: (వ్యంగ్యంగా) మరి సేనాపతిగా అశ్వత్థామ
అభిషిక్తుడయినాడా?

కృపా: దుర్యోధనుడన్నాడు. "కృపాచార్యా! మీరు విప్రులు.
ఇక్కడ నీరులేదు. మీ స్వేదబిందువులతో
వీరుడైన అశ్వత్థామను అభిషిక్తుణ్ణి చేయండి." అని.
"చేతులెలా ఎత్తను? భుజాల నుంచి వేళాడే
ఈ చేతులతో ఎలా ఆశీర్వదించను" అన్నాడతను.
ఆ నిర్జీవమైన చేతుల్ని
ఆశీర్వాదముద్రలో దగ్గరగా చేర్చాను.
ఆశీర్వాదానికి బదులుగా
హృదయవిదారకమైన ఆర్తనాదం చేశాడు.

అశ్వత్థామ: కాని ఆయన జీవించే ఉంటాడు –
"ప్రతీకారం తీర్చుకున్నాను" అన్న
నా మాట చెవిని బడే దాకా
ఈ పశువులు నా అంగాగాల్ని
విరిచేసినా సరే, బ్రతికే ఉంటాను."

అన్నాడు దుర్యోధన చక్రవర్తి.
విన్నావా! కృతవర్మా!
రేపీపాటికి నీ ప్రతీకారం తీర్చుకుంటాను.
సేన లేకపోయినా, ఒంటరిగానైనా సరే!

**కృతవర్మ:** (పడుకుంటూ) నీతోనే ఉంటాను
సేనాపతీ! (విసుగ్గా ఆవలిస్తాడు.)

**కృపా:** ఇహనైనా మమ్మల్ని విశ్రాంతి తీసుకోనీ!

**అశ్వత్థామ:** (కొత్త కంఠంతో) ఇవాళ్టికి – ఈ రాత్రికి
విశ్రమించండి సైనికులారా!
రేపేం చెయ్యాలో సేనాపతి
అశ్వత్థామ చెబుతాడు.

(కృతవర్మ, కృపాచార్యుడు విశ్రాంతి తీసుకుంటూ ఉంటారు. అశ్వత్థామ ధనుస్సును ధరించి కాపలా కాస్తూ ఉంటాడు.)

**అశ్వత్థామ:** ఎంత నిశ్శబ్దం! ఈ వనమంతా మౌనంగా ఉంది
కేవలం నేనొక్కణ్ణే ఇక్కడ!
ఇక్కడి వటవృక్షాల నీడలు కూడా
నిదురిస్తున్నాయి....

(నెమ్మది నెమ్మదిగా రంగస్థలం మీద చీకటి ఆవరించింది. వనంలోనర నక్కల ఊళలు. జంతువుల భయంకరమైన అరుపులు. చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. అశ్వత్థామ ఒక్కడే తిరుగుతున్నాడు. ఉన్నట్టుండి కాకులు కర్కశ స్వరంతో అరుస్తాయి. కుడి పక్కనుంచి నల్లని వస్త్రాలు ధరించి కాకి ముఖాకృతితో ఒక శిశునర్తకుడు వస్తాడు. రెక్కలు విప్పుకుని తిరుగుతూ వుంటాడు. రెండుసార్లు స్టేజీ చుట్టూ తిరిగి మోకాళ్ళ మీద వంగి, భుజాల మీద గడ్డం పెట్టుకుని పక్షిలా నిద్రపోయన్నట్టు నటిస్తాడు. ఈ లోపల అశ్వత్థామ మీద బొత్తిగా వెలుగుపడకూడదు. ఒక నీలి కిరణం మాత్రం కాకిమీద పడుతుంది.

తిరిగి స్వరం ఎక్కువవుతుంది. ఎడమపక్క నుంచి తెల్లని వస్త్రాలు ధరించి గుడ్లగూబ ఆకృతిలో రెక్కల్ని వేగంగా కదిలిస్తూ మరో శిశునర్తకుడు వస్తాడు. కాకిని చూస్తాడు. అప్రమత్తం అయిపోతాడు. ఉల్లాసంగా రెక్కలు విప్పుకుని టపటపలాడిస్తాడు. కొత్తకొత్త హావభావాలతో కాకి మీద దాడి చెయ్యడానికి చూస్తాడు.

అశ్వత్థామ మీద వెలుగు పడుతుంది. అతడు స్తబ్దంగా, కుతూహలంగా ఈ దృశ్యాల్ని చూస్తూ ఉంటాడు. కాకి బద్ధకంగా ఒళ్ళు విరుస్తుంది. గుడ్లగూబని చూచికూడా లెక్కలేనట్లు మళ్ళీ ఒక్కసారిగా దాడి చేస్తుంది... భయంకరమైన శబ్దాలు......అరుపులు.....కోలాహలం......ఛీత్కారం. రెండు ఒకదానికొకటి పొడుచుకుంటూ వుంటాయి. చిమ్మచీకటి.....వెంటనే వెలుగు......కాకివి విరిగిన రెక్కలు. గుడ్లగూబ రక్తసిక్తమైన పంజా. గుడ్లగూబ ఆ రెక్కలను ఏరుకుని వాటిని చూస్తూ నాట్యం చేస్తుంది. ఆనందం – చంపిన ఆనందం – రాక్షసానందం.

అశ్వత్థామ మీద వెలుగు. ఉన్నట్టుండి అతని ముఖాకృతి మారిపోతుంది. బిగ్గరగా అట్టహాసం చేస్తాడు. గుడ్లగూబ గాభరాపడిపోతుంది. అశ్వత్థామ అట్టహాసం చేస్తూ తన వైపు రావడం గమనిస్తుంది. గుడ్లగూబ కాకి

ఈకలు, రెక్కలు అతని వైపు విసిరి వెళ్ళిపోతుంది. అశ్వత్థామ – విరిగిన రెక్కలను చేతిలోకి తీసుకుని ఆనందంగా అరుస్తాడు.)

**అశ్వత్థామ:** దొరికింది.........దొరికిపోయింది మామా!
నాకు దొరికింది.

(వెలుగు......రక్తంతో తడిసిన రెక్కల్ని చేతిలో పుచ్చుకుని ఎగిరి గంతులేస్తూ ఉంటాడు. వీరులిద్దరూ ఉలిక్కిపడి లేస్తారు. కృతవర్మ గాభరాగా ఒరలో నుంచి కత్తితీస్తాడు.)

**కృపా:** ఏం దొరికింది అశ్వత్థామా?

**అశ్వత్థామ:** మామా! నిజం దొరికింది.
అడవి మృగం అశ్వత్థామకి – నిజం దొరికింది.

**కృతవర్మ:** గాయపడి తెగిన ఈ రెక్కలా?

**అశ్వత్థామ:** యుధిష్ఠిరుడి అర్ధసత్యం
గాయపడి తెగిపడింది. (వెళ్ళడానికి సన్నద్ధుడవుతాడు.)

**కృపా:** ఎక్కడికి వెడుతున్నావ్ నువ్వు?

**అశ్వత్థామ:** పాండవుల శిబిరానికి – నిద్రలో
నిరాయుధులై – అచేతనంగా పడివుంటారు.
విజయోన్మత్తులై పడివుండే
పాండవ శిబిరం వైపుకు

(నడుముకు ఛట్టీ బిగిస్తాడు)

**కృపా:** ఇప్పుడా?

**అశ్వత్థామ:** సరిగ్గా ఇప్పుడే!
వాళ్ళంతా ఒంటరిగా ఉన్నారు.
గాంధారిని ఓదార్చడానికి
కృష్ణుడు హస్తినాపురం
వెళ్ళివుంటాడు.
ఇంతకుమించిన మంచి సమయం దొరుకుతుందా?

**కృతవర్మ:** ఇది సేనాపతి ఆదేశమా?

**అశ్వత్థామ:** (వినిపించుకోకుండా)
నువ్వే అన్నావు కదా – "నరుడో – కుంజరమో" నని.
కుంజరంలానే – నా పదాఘాతాలతోనే
ధృష్టద్యుమ్నుణ్ణి పొడిపొడి చేస్తాను.
మదమెక్కిన – పిచ్చెక్కిన ఏనుగులా
తామర మొగ్గ లాంటి ఉత్తరను నలిపేస్తాను.

పాండవ కులదీపుడు – అర్జున కుమారుణ్ణి
కూడా వదలను.

**కృపా:** వద్దు, వద్దు....ఇది జరగనివ్వను నేను.

**అశ్వత్థామ:** జరిగి తీరుతుంది. నువ్వు వెంటరాకపోతే
నేను వెడతాను. ఒంటరిగా వెడతాను. వెడతాను. వెడతాను.
(వెడతాడు. అతని వెనకాల కృతవర్మ తలవంచుకుని నెమ్మదిగా వెడతాడు.)

**కృపా:** ఆగు......ఆలోచించు అశ్వత్థామ.

(అశ్వత్థామ వినిపించుకోకుండా వెళ్ళిపోతాడు. కృపాచార్యుడు ఆ వెనకనే "అశ్వత్థామ.....అశ్వత్థామా.." అని పిలుస్తూ వెడతాడు. ఆ ధ్వనికి నెమ్మదిగా దిగంతాల వ్యాపించి క్రమంగా ఆగిపోతుంది...మూడు రథాల చప్పుడు......గుర్రపుడెక్కల చప్పుడు దగ్గరగా మొదలై రానురాను దూరం అవుతుంది.)

(తెర)

# విరామం

**రెక్కలు**
**చక్రాలు**
**పట్టీలు**

(వృద్ధ యాచకుడి ప్రవేశం. రంగస్థలం మీద సాలెగూడు లాంటి కాంతిరేఖలు. కొద్దోగొప్పో ప్రేతాత్మలను గుర్తుచేసే లేదా ప్రేతలోక వాతావరణం సూచించే రంగాలంకరణ.)

**యాచకడు:** (స్వగతం)
మొట్టమొదట నేను వృద్ధ యాచకుణ్ణి
అబద్ధపు భవిష్యత్తుని. ఇప్పుడు ఓ ప్రేతాత్మని.
అశ్వత్థామ నన్ను వధించాడు.
జీవితం ఆగని నదీ ప్రవాహం.
మృత్యువు నన్ను చెయ్యిపట్టుకుని
ఒడ్డుకు లాక్కొచ్చింది......
తటస్థుడనై ఒడ్డున నుంచుని చూస్తున్నాను.
"ఈ యుగం ఒక గుడ్డి సముద్రం లాంటిది.
నలుచెరగులా పర్వతాలు, గుహలు, ద్వారాలు
భయంకరమైన తుఫాను ఆ సముద్రాన్ని
నాలుగు పక్కలనుంచీ దాన్ని మథిస్తున్నది.
ప్రవాహంలో వేగం ఉంది; మథనం ఉంది.
కాని – నదిలా సాఫీగా లేకపోగా –

నాగలోక గహ్వరంలో ఉన్నట్టు
వందలకొద్దీ కుబుసం వదలని పాములు
గడ్డిపాములు.
ఒకదాని నొకటి పెనవేసుకుని
వెనకకీ – ముందుకీ; కిందికీ – పైకీ
వంకర టింకరగా పాకుతున్నట్టున్నాయి.
అలాగే –
వందలకొద్దీ ధారోపధారలు
గుడ్డిపాముల్లా బిలబిలమంటున్నాయి.
ఇలావుంది అంధ సముద్రం.
దీన్నే ఇవ్వాళ మనం 'భవసాగరం' అంటున్నాం.
కొన్ని తెల్లటి కుబుసాలు పైన తేలుతున్నాయి –
తొల్లని పట్టీల్లాగా.
గాంధారి కళ్ళకు, సైనికుల గాయాలమీద
ఉన్న పట్టీలు ఇవే!
నా ప్రేత శక్తితో ప్రవాహాన్నంతనీ
ఈ కథా గమనాన్నంతనీ ఆపేశాను.
దాంతో ఎక్కడి పాత్రలక్కడే
కదలకుండా నిలిచిపోయాయి.
నేను అందరి హృదయాలను చీల్చి
అంతరంగాలను మథించి
వారి లోలోపలి భావాలను
తెలుసుకుందామనుకుంటున్నాను.
ఆ పాత్రలు – ఇవిగో!
నా మంత్రశక్తితో పరిచాలితం అయ్యే
ఆ పాత్రలు ఛాయారూపంలో వస్తాయి.

(యుయుత్సుడు, విదురుడు, సంజయుడు యాంత్రికంగా మంత్రముగ్ధులైనట్లు వస్తారు. వృద్ధుడి వెనక ఒకే వరసలో నిలబడతారు. ఒక్కొక్కళ్ళు ముందుకువచ్చి చెప్పదలుచుకున్నది చెప్పి, తిరిగి యధాస్థానంలోకి పోయి నిలబడతారు.)

**యుయుత్సుడు:** నేను యుయుత్సుణ్ణి.
యుద్ధ సమయంలో ఆసాంతమూ
రధానికి ఉన్న చక్రంలాంటి వాణ్ణి.
ఇరుసు తిన్నగా అమర్చని చక్రంలాంటి వాణ్ణి.

కనుకనే ఊడిపోయిందా చక్రం.

**సంజయుడు:** నేను సంజయుణ్ణి.
కర్మలోకంనుంచి బహిష్కరించారు నన్ను.
రెండు పెద్ద చక్రాలమధ్య చిక్కుకున్న వాణ్ణి.
ఒక నిరర్థకమైన శోభా చక్రాన్ని.
పెద్ద చక్రాలతో పాటు తిరిగే చిన్న చక్రాన్ని
కాని రథాన్ని ముందుకు నడిపించలేని చక్రాన్ని.
భూమిని అంటని చక్రాన్ని.
ఇరుసును ఆధారంగా చేసుకోలేక పోవడం కన్న
జీవిత చక్రానికి పెద్ద దౌర్భాగ్యం మరేదీ ఉండబోదు.

**విదురుడు:** నేను విదురుణ్ణి. కృష్ణ భక్తుణ్ణి. అనుచరుడిన.
నీతిజ్ఞుడిని..........కాని నా నీతి చాలా సామాన్యమైనది.
యుగపరిస్థితులు మాత్రం అసాధారణమైనవి.
ఇప్పుడు నా స్వరం సంశయంతో నిండి వుంది.
ఎందుకో తెలుసా?
నేను నమ్ముకున్న నా ప్రభువు
పనికిరాని ఇరుసులాంటి వాడనిపిస్తుంది.
అందుకే చక్రాలన్నీ ఊడిపోయాయి....
కాని, నాకు తెలుసు, సంశయమే పాపం.
అందుకే నేను పాపం చెయ్యకూడదనుకుంటున్నాను.

(నేపథ్యంలో గంటల గలగల...ఒక నెమలి కన్ను ఎగురుతూ వచ్చి రంగస్థలంమీద పడుతుంది. వృద్ధుడు వంగి దానిని తీస్తాడు.)

**యాచకుడు:** ఏమిటిది? నెమలి కన్ను!
గాంధారిని ఓదార్చి
హస్తినాపురం నుంచి తిరిగివెళ్ళే
కృష్ణుడి కిరీటం నుంచి ఊడిపడినట్టుంది.
(విని) ఆ! ఈ గంటల గలగల
కృష్ణుని రథానివే!
ఆపనా ఈ రథాన్ని?

(సమ్మోహనం చేద్దామని ప్రయత్నించి విఫలుడై)

ఆపినట్లయితే ప్రవహించే కాలమర్యాదను
అతిక్రమించినట్లవుతుంది. బంధించలేను.

నేను కాలాన్ని బంధించలేను.

(రెండో రథ ధ్వని)

ఆ! ఇది రెండోరథమల్లే ఉందే!
దీనిని, నేనేమిటి? కృష్ణుడు కూడా ఆపలేకపోయాడు.
ఇది నన్ను చంపిన అశ్వత్థామది.
తెగిపడి, రక్తంతో రంగరించబడ్డ
కాకి రెక్కలాగా – నల్లగా –
అతని అణగారని అసహ్యం.
నెమలికన్ను గెలిచేనో ఓడేనో?
అసహ్యమనే ఈ కొత్త కాళీయుణ్ణి
కృష్ణుడు మర్దన చేయగలడో లేదో?

(రథ ధ్వని వేగవంతమౌతుంది.)

రథాలు ముందుకు సాగుతున్నాయి.
నేను అశక్తుణ్ణి.
కథాగమనాన్ని బంధిద్దామనుకున్నాను
కాని బంధించడం చేతకాని వాణ్ణి.
కృష్ణుడి రథం చీకట్లో కలిసిపోతోంది..........
అశ్వత్థామ రథం పాండవుల శిబిరానికి వెళ్ళింది.

(రథ ధ్వని ఆగిపోతుంది.)

వీరెవరు?
అంధకారంలో
విరాట్‌రూపుడు!
అశ్వత్థామ ఎదురుగా
నల్లని రాయిలా
అడ్డంగా నిలబడి ఉన్నాడు!

(గాభారాపడి రెండు చేతులతో కళ్ళుకప్పుకుంటాడు. ఏదో భయంకరమైన దృశ్యం చూస్తున్నట్లున్నాడు. నేపథ్యం నుంచి భయంకరమైన మేఘగర్జన.)

## నాలుగో అంకం

## గాంధారి శాపం

## కథాగానం

(అశ్వత్థామ స్వరం)

జటాకటాహ సంభ్రమన్నిలింప నిర్ఘరీ సమా
విలోలవీచి వల్లరీ విరాజమాన మూర్ధనీ
ధగద్ధగ ద్ధగ జ్వల ల్లలాట పట్ట పావకే
కిశోర చంద్ర శేఖరే రతి ప్రతిక్షణం మమ ॥

అప్పుడు – అశుతోషుడు – చేయెత్తి అశ్వత్థామతో
ఇట్లా చెప్పాడు: నిశ్చయమ్మగా

(తెర పడి వెంటనే లేస్తుంది. గాంధారి కూర్చుని ఉంటుంది. ఇది వరకే మాట్లాడుకుంటున్న విదురుడు, సంజయుడు)

**గాంధారి:** తర్వాతేం జరిగింది? సంజయా!
ఏమైందో చెప్పు.

**సంజయుడు:** (అప్పచెబుతున్నట్లుగా)
దైవ దత్తమైన శంకరుడి
ఖడ్గాన్ని అశ్వత్థామ తీసుకుని –
ధృష్టద్యుమ్నుడి మీద
మెరుపులా దాడి చేశాడు.
శయ్యమీద నుంచి కిందకు లాగి
మోకాళ్ళతో అతన్ని అదిమిపట్టి
చేతులతో గొంతు నులిమాడు.
పచ్చి మామిడికాయలోని టెంకల్ని
కత్తితో పెకలించినట్టు
కళ్ళడొప్పల్లోనుంచి రెండు గుడ్లనీ
కత్తితో పెకలించాడు. అతని
కంటి లోలోతుల్లో నుంచి
నల్లని రక్తం చిమ్మింది.

**గాంధారి:** ముందే అతన్ని గుడ్డివాణ్ణి చేశాడా?
ఎంతటి దయామయుడు అశ్వత్థామా!

**సంజయుడు:** అతికష్టం మీద – మాటల్ని పెగలించుకుని
“చంపాలనుకుంటే అస్త్ర శస్త్రాలతో చంపు”
అన్నాడు ధృష్టద్యుమ్నుడు.
“నువ్వందుకు తగవురా, నరపశువా!”

అన్నాడు అశ్వత్థామ.
"నిరస్త్రుడైన ద్రోణుణ్ణి పిరికిపందలా చంపావు.
అందుకు నీకిదే తగిన శాస్తి" అని
పిడిగుద్దులతో అతని మర్మావయాలను –

విదురుడు: చాలు........ఆపింక............

గాంధారి: తర్వాత?

సంజయుడు: ఈ కోలాహలం అంతా విన్న యోధులంతా మేల్కొన్నారు.
అస్తవ్యస్తంగా పడుకున్న వాళ్ళు
కళ్ళు నులుముకుంటూ బయటకు వచ్చారు.
విషపూరితమైన బాణాలతో వారందర్నీ
క్షణమాత్రంలో నేలకొరిగించాడు అశ్వత్థామ.
శతానీకుడికి యుద్ధం చేయడానికేమి దొరకలేదు.
లేకపోతే ముందే అశ్వత్థామను ఎదుర్కొనేవాడే!
అశ్వత్థామ అతని కాళ్ళను నరికేశాడు.
దూరంగా పడుకుని ఉన్న శిఖండి నుదురు చీరేలా
ఒక వాడి బాణాన్ని వదిలాడు అశ్వత్థామ.
దాంతో చందనం పేర్చిన శయ్యతో
భూమిలోకి వెళ్ళిపోయాడు శిఖండి.

గాంధారి: ఊ! తరువాత?

విదురుడు: నీ హృదయం ఇంత పాషాణంగా మారిందేం గాంధారీదేవీ?

గాంధారి: రాళ్ళలోనుంచే రత్నాలు పుడతాయి.
అడ్డు ప్రశ్నలు వేయకు విదురా –
చెప్పు సంజయా!

విదురుడు: సంజయుడు కాదు నేను చెబుతాను విను.
ఎంత కాఠిన్యమో? ఎంత ప్రతీకార వాంఛో?
కృతవర్మ, కృపాచార్యుడు యుద్ధాగారం
వెలుపల వేచి ఉన్నారు.
పారిపోయే వృద్ధుల్ని, పిల్లల్ని, సేవకుల్ని
బాణాలతో వధించాడు కృతవర్మ.
భయపడిపోయిన ఘీంకరిస్తూ
స్కంధావారాలను చీల్చుకుని
స్త్రీలను, పిల్లలను కాలరాచాయి.
అదే అదనుగా, ఆ ఇద్దరు వీరులు

పాండవ శిబిరాలకు నిప్పు పెట్టారు.

**గాంధారి:** నాకు చూడడానికి అవకాశం ఉండి ఉంటే –
ఎంత బావుండేది?
అశ్వత్థామ – జ్యోతిస్వరూపుడిలా –
ఉండి ఉంటాడు.

**సంజయుడు:** పొగ – అంతటా అలుముకున్న పొగ –
నిప్పురవ్వలు, కాలికి వేళాడే చర్మాలు
గాయపడ్డ గుర్రాలు, విరిగిన రథాలు
రక్తం, మాంసం, తెగిపడ్డ తలలు –
సింహనాదం చేస్తూ అశ్వత్థామ.
అతని భుజాల నుంచి మొలకెత్తిన కత్తిలా
దైవ దత్తమైన ఖడ్గం నరరక్తంతో తడిసి
అతని చేతులకు అతుక్కుని పోయింది.

**గాంధారి:** ఆగు, సంజయా, ఆగు.
దివ్య దృష్టితో వీరుడైన అశ్వత్థామను
నాకు చూపించు.

**సంజయుడు:** అమ్మా! అతడు కురూపి అయినాడు.
భయంకరంగా ఉన్నాడు.

**గాంధారి:** కాని వీరుడు. నా నూర్గురుపుత్రులు
చేయలేనిది అతను చేశాడు.
ద్రోణుడూ, భీష్ముడూ చేయలేనిది
అతను చేశాడు.

**సంజయుడు:** అమ్మా! వ్యాసుడు యుద్ధానంతం వరకే
నాకు దివ్య దృష్టినిచ్చాడు.
ఇప్పుడా శక్తి నాలో ఉందో లేదో తెలియదు.

**గాంధారి:** అందుకే చెబుతున్నాను.
అన్యాయం చేయడానికి అలవాటు పడ్డ కృష్ణుడు
అశ్వత్థామను ఇక బ్రతకనీయడు.
అందుకే ఒక్కసారి అతన్ని నాకు చూపించు.

**సంజయుడు:** ప్రయత్నిస్తాను. నా సంచిత పుణ్యాన్ని పణంగా పెట్టి
అశ్వత్థామను మీకు చూపిస్తాను.

(ధ్యానం చేస్తాడు.)

అడ్డుగోడలు తొలిగిపోవాలి.

దూర తీరం దాపు కావాలి.
దృష్టిని సారించడానికి
ప్రతిబంధకాలయిన అడ్డంకులన్నీ
అదృశ్యం కావాలి.
వాటిని కప్పుకున్న మాయ ఆవరణం
తొలిగిపోవాలి.
భూమ్యాకాశాల కావల
దృష్టిగోచరం కాని
సమస్త దృశ్యాలు సమీపం కావాలి.

(వెనక తెరలేస్తుంది.....ఈ ముందు ఉన్న కాంతి తగ్గిపోతూ ఉంటుంది.)

చీకటిగా ఉంది.
మరణాసన్నుడైన దుర్యోధనుడు
నిన్నటిదాకా పడిఉన్న చోటు ఇది.
శస్త్రాస్త్రాలతో వచ్చిన ఈ వీరులు
కృపాచార్య, కృతవర్మలు.

(వెనక, దూరంనుంచి వాళ్ళు "దుర్యోధన మహారాజా" అని పిలుస్తారు.)

కృపా: కాంతి బాణాలను విసురు.
అంధకారాన్ని ఛేదించు.

కృతవర్మ: (నేపథ్యంలోకి చూసి)
అరుగో దుర్యోధన మహారాజు
అర్థమృతుడైన అతని శరీరాన్ని
క్రూరమృగాలు ఆ పొదల్లోకి
ఈడ్చుకుపోతున్నాయి.

కృపా: జీవించి ఉన్నట్టుగా ఉంది.......
పెదవులు కదులుతున్నట్లు అనిపిస్తుంది.

కృతవర్మ: నోటినుంచి రక్తం కక్కుకుని ఉండాలి.
చుట్టూ రక్తం నల్లగా గడ్డకట్టుకుని ఉంది.
గొంతు పూడుకుపోయినట్టుంది.
ప్రాణం కొట్టుకుంటున్నట్టుగా ఉంది.

కృపా: (ఆగాగి – బిగ్గరగా)
మహారాజా!......సేనాపతి........అశ్వత్థామ
పాండవ శిబిరాన్ని........పూర్తిగా......నాశనం చేశాడు.

ఒక్కణ్ణి..........ఒక్కణ్ణి కూడా మిగల్చకుండా........వధించాడు.

**కృతవర్మ:** మహారాజు ముఖంమీద సంతోషపు కాంతి
తళుక్కున మెరిసింది.

**కృపా:** రెప్పలు కూడా తెరిచి –

**కృతవర్మ:** వెతుకుతున్నట్టున్నారు –
బహుశా: అశ్వత్థామనేమో?

**కృపా:** మహారాజా! అశ్వత్థామ
తన బ్రహ్మాస్త్రాన్ని, మణిని
తెచ్చుకోవడానికి వెళ్ళాడు.
అవి తెచ్చాక, మేము అడవుల్లోకి
వెళ్ళిపోతాం.

**కృతవర్మ:** మహారాజు కళ్ళలో అశ్రుకణాలు.........

(గాంధారి మీద, సంజయుదు మీద కాంతి)

**సంజయుడు:** అదేమిటి తల్లీ! కళ్ళగంతలు తీయనేలేదు!
అడుఓ అశ్వత్థామ! వచ్చాడు......చూడండి.........

**గాంధారి:** లేదు.......లేదు......లేదు.....నేను చూడలేను.
మరణోన్ముఖుడైన దుర్యోధనుణ్ణి
ఏ విధంగా నయినా ఉండనీ సంజయా!
ఈ గంతలు ఇలాగే ఉండనీ!
.....ఏమవుతుందో మాత్రం
నాకు చెబుతూ ఉండు.

**సంజయుడు:** అశ్వత్థామ వచ్చేశాడు.
కాని తల వంచుకుని మౌనంగా నిలబడ్డాడు.

(ముందున్న కాంతి ఆరిపోతుంది.)

**కృపా:** మహారాజా! మీ అశ్వత్థామ వచ్చాడు.
చెయ్యి ఎత్తలేరు. కళ్ళెత్తి అయినా
ఇతన్ని ఆశీర్వదించండి.

**అశ్వత్థామ:** వద్దు, ప్రభూ! వద్దు.
ఇప్పటికీ మీ ఆశీస్సులు పొందడానికి అనర్హుణ్ణే!
నా తండ్రి హత్యకు ప్రతీకారం
దృష్టద్యుమ్నుడి వధ.
ఇంకా మీ పగ, ప్రతీకారం తీర్చనేలేదు.

ఇంకా ఉత్తర మిగిలేఉంది....
పాండవుల వారసుణ్ణి జన్మిస్తుంది.
కాని, ప్రభూ!......నా పని తప్పక నెరవేరుస్తాను...
సూర్యలోకంలో గురుద్రోణుణ్ణి
కలిసినప్పుడు........చెప్పండి..........

**కృతవర్మ:** ఎవరితో బెబుతున్నావు?
అశ్వత్థామా!......ఎవరితో?
మహారాజు మనకిక లేరు.

(శోక సూచన సంగీతం. కృపాచార్యుడు విహ్వలుడై మొహం కప్పుకుంటాడు. తర్వాత గాంధారి అరిచి పడిపోతుంది.)

**అశ్వత్థామ:** ఎవరదీ ఆర్తనాదం! తల్లి గాంధారిదా?
నిన్ను పుత్రహీనును చేసిన కృష్ణుడు
తన యోగమాయతో ఉత్తరను రక్షించినా సరే –
నేను మాత్రం ఆమెను వదలను.
పుత్రహీనను చేసిగాని వదలను.

(వెనక తెర పడుతుంది.)

**గాంధారి:** సంజయా!
సంజయా! నా కళ్ళ గంతలు తీయనీ!
అశ్వత్థామను చూస్తాను.
అతని శరీరాన్ని వజ్రసదృశం చేస్తాను.
సంజయా! ఇదిగో చూడు........
నా కళ్ళగంతలు తీసేశాను.........
అశ్వత్థామ ఎక్కడ?

(వెనక తెర పూర్తిగా మూసుకుపోతుంది.)

**సంజయుడు:** ఇప్పుడేమయింది నాకు? అమ్మా!
ఇప్పటిదాకా దివ్యదృష్టితో చూస్తూనే ఉన్నాను.
ఉన్నట్టుండి ఒక్కసారిగా దానికి తెర పడిపోయింది.

**గాంధారి:** త్వరగా........కన్నీళ్ళు రాలనీకు –

**సంజయుడు:** ఓ! వ్యాసభగవాన్!
అడ్డుగోడలు తొలిగిపోవాలి!
దూరతీరం దాపుకావాలి!
అమ్మా! అమ్మా! గాంధారీ!!

నా దివ్యదృష్టి కేమయిందివాళ?
ఈ అడ్డుగోడలు తొలిగిపోవాలి.....
నా కళ్ళు తెరుచుకోవడం లేదు!
అంధులకు నిజాన్ని చూపాలంటే
నేను కూడా అంధుణ్ణి కావాలా?

**విదురుడు:** సంజయా! నీకు కన్పించడంలేదా?
వనభూమి......దుర్యోధనుడు....

**సంజయుడు:** లేదు విదురా!.....కేవలం గోడలు....అడ్డుగోడలు!

**విదురుడు:** అన్నీ అంతం కావడానికి
సమయం ఆసన్నమయినట్లుంది.

(గాంధారి నిశ్చేతనంగా కూర్చుని ఉంది.)

**సంజయుడు:** ఈ స్వల్పకాలానికి మాత్రమే
నాకు దివ్యదృష్టి నెందుకిచ్చావు, వ్యాసభగవాన్?
ఇకనుంచి ఎప్పుడూ – ఈ పరిమితమైన
దృశ్య జగత్తులో నేను తృప్తి పొందలేను.
హద్దులను అధిగమించి అనంతాల కావల ఉన్నది.
చూడాలని నా ఆత్మ ఎప్పుడూ దప్పికగొనే ఉంటుంది.

**విదురుడు:** తల్లీ! లే! హస్తినాపురాన్ని వదిలెయ్యి.
నీ వాళ్ళందరికీ అంతిమ సంస్కారం చెయ్యి.
సంజయా! బంధువులందరితో చెప్పు
ఈ వేళ యుద్ధభూమికి వెడుతున్నామని......

**సంజయుడు:** (వెడుతూ) పద్దెనిమిది రోజుల
భయంకరమైన యుద్ధం
నాకు దివ్యదృష్టినిచ్చి
మళ్ళీ తీసుకుపోయింది....

(యుయుత్సుడు వస్తాడు.)

**విదురుడు:** పద తల్లీ! మహారాజును పిలవండి.
యుయుత్సా! నువ్వూ నడు.

**యుయు:** ఎవరి మరణానికి స్వయంగా కారకుణ్ణయ్యానో
వారికే అంజలి ఘటించి, తర్పణాలు వదిలితే
వారు స్వీకరిస్తారా? వారంతా నా బంధువులు. నా పరిజనులు.
కాని, విను కృష్ణా! నేను ఏ మొహం పెట్టుకుని

వారికి తర్పణాలు వదలగలను?

(అందరూ వెళ్ళిపోతారు.....వెనక తెర నెమ్మది నెమ్మదిగా పడిపోతుంది.)

**కథాగానం**

(క్రమంగా ధృతరాష్ట్రుడు, యుయుత్సుడు, విదురుడు, సంజయుడు, గాంధారి నెమ్మది నెమ్మదిగా నడుస్తూ రంగస్థలం మీదకు వస్తారు. ధృతరాష్ట్రుడు వణుకుతూ, నిలదొక్కు కోలేక నిస్సహాయంగా నడుస్తూ ఉంటాడు.)

**ధృత:** వృద్ధుణ్ణి...శిథిలమైన శరీరంతో
నడవలేక పోతున్నాను.

**విదురుడు:** సంజయా! ఓ క్షణం ఆగు.

(మహారాజు కూర్చుండి పోతాడు. అందరూ ఆగుతారు.)

**యుయు:** ఎవరివా రథాలు? ఆ పొదల్లో
దాగి ఉన్నట్లుగా ఉన్నాయి!

**సంజయుడు:** వారు కృపాచార్యులవారు.!

**విదురుడు:** ఇటు చూడండి, కృతవర్మ!

**గాంధారి:** సంజయా! అశ్వత్థామ?

**విదురుడు:** అవును తల్లీ! అడుగో అశ్వత్థామ!

**ధృత:** పోనిద్దూ –

**గాంధారి:** ఆపండి అతన్ని.

**సంజయుడు:** ఆగు.....ఆగు అశ్వత్థామా!
నేను సంజయుణ్ణి......
తల్లి గాంధారి......మహారాజు
విదురుడు.....యుయుత్సుడు ఇక్కడే ఉన్నారు.

**ధృత:** సంజయా! యుయుత్సుడి పేరెత్తకు.
కోపంతో ఉడికిపోతున్న అశ్వత్థామ
అతన్ని వదిలిపెట్టడు.
నాకు మిగిలిన పుత్రుడు వీడొక్కడే!
వాణ్ణి కూడా పోగొట్టుకుని నే బ్రతికేదెలా?

**గాంధారి:** అవును లెండి.
పరాక్రమవంతుడు, సాహసోపేతుడు
యశస్వి అయిన పుత్రుడు కదా!
సంజయా – పద.

యుయుత్సుణ్ణి ఇక్కడే ఉండనీ!
అంధుడైన తండ్రికి, వృద్ధురాలైన తల్లికి
ఇప్పుడు నువ్వే దిక్కు.

(సంజయుడితో వెడుతుంది.)

యుయు: ఇవన్నీ వింటూ, ఇటువంటి వన్నీ వింటూ,
ఇంకా జీవించి ఉండాలా నేను?
ఎవరికోసం? ఎవరి కోసం?

ధృత: యుయుత్సా! నా గుడ్డితనానికి ఫలితానివి నువ్వు.
అదే నీ పరిథి!
దాన్ని ఉల్లంఘించి కాంతివలయంలో ఉండాలనుకున్నావు!

విదురుడు: ఏం? అది అపరాధమా?

(గాంధారి, సంజయుడు తిరిగివస్తారు.)

ధృత: వచ్చేశావా సంజయానువ్వు?

సంజయుడు: అశ్వత్థామ ఇప్పుడు పూర్తిగా
మారిపోయినట్టున్నాడు.
ఇప్పుడతను వీరుడు కాడు.
మూర్తీభవించిన భయం.
ఉండుండి కంపిస్తున్నాడు.
రథం పగ్గాలు కూడా చేతినుంచి జారిపోతున్నాయి.

గాంధారి: పిచ్చివాడు! వల్కలాలు ధరించి
తపోవనానికి వెడతానంటున్నాడు.
కృష్ణుడికి భయపడుతున్నాడనుకుంటాను.

(ఏదో పెద్ద శబ్దం......అతీతమైన అలౌకికమైన కాంతి.)

సంజయుడు: పాండవుల్ని తీసుకుని కృష్ణుడు వస్తున్నాడు –
అశ్వత్థామను వెదుక్కుంటూ –

గాంధారి: కృష్ణుడతన్ని చంపలేడు
అతని శరీరం మీద ఆసాంతం దృష్టిసారించి
దాన్ని వజ్రసదృశ్యం చేశాను నేను.

(మళ్ళీ దూరంగా పెద్ద చప్పుడు)

విదురుడు: ప్రభువు అతన్ని వెతికి పట్టుకున్నట్టున్నాడు!

ధృత: సంజయా! కొంచెం చూడు –

**సంజయుడు:** వ్యాసుడు నా దివ్యదృష్టిని వెనక్కి తీసుకున్నాడు.

**యుయు:** ఇది అర్జునుడి  అగ్ని బాణపు కాంతి.

**విదురుడు:** మాడి మసైపోతున్నది అడవి.

(ఆరిపోయిన రెండు అగ్ని బాణాలు రంగస్థలం మీద పడతాయి.)

**ధృత:** సంజయా! దూరంగా వెళ్ళు
ఇక్కడ నుంచి దూరంగా వెళ్ళు.

**గాంధారి:** కృష్ణా! నువ్వు అశ్వత్థామకేమైనా
అరిష్టాన్ని కలగచేస్తే –

(మండే బాణాలు రంగస్థలంమీద పడతాయి.)

**విదురుడు:** తల్లీ! పద. ఇక్కడ వుండడం క్షేమం కాదు.
మండే శరపరంపరలు
ఇక్కడదాకా పడుతున్నాయి!

(వెళ్లిపోతారు. కొద్దిసేపు రంగస్థలం ఖాళీగా ఉంటుంది. నేపథ్యంలో శంఖనాదం. అదే పనిగా భయంకరమైన చప్పుళ్ళు–తీవ్రమైన కాంతి. అకస్మాత్తుగా అశ్వత్థామ పరిగెత్తుకు వస్తాడు. అతని కంఠంలో బాణం గుచ్చుకుని ఉంది. బాణాల్ని లాగేస్తాడు. రక్తం కారుతుంది. ఇంతలో రెండో బాణం వస్తుంది. దాన్నుంచి తప్పించుకుంటాడు. నిలదొక్కుకుంటాడు. క్రోధంతో మొహం రక్తవర్ణం అవుతుంది.)

**అశ్వత్థామ:** రక్షించుకో – నిన్ను నువ్వు రక్షించుకో అర్జునా!
నిన్ను నువ్వు రక్షించుకో –
వల్కలాలు ధరించి తపోవనంలోనికి పోయి
తాపసి  నవుదామనుకున్నాను.
పాండవులందరి నిర్మూలన జరిగితేనే గాని
కృష్ణుడి యుద్ధదాహం తీరేటట్టు లేదు.
సరే! ఈ బ్రహ్మాస్త్రాన్ని కాచుకో!
నువ్వు చేసిన దుష్కర్మలను గుర్తుచేసుకో –
ఈ అస్త్రం నుంచి నిన్ను కృష్ణుడుకూడా రక్షించలేడు.
ఈ అస్త్రాన్ని నీ మీద ప్రయోగించక తప్పడంలేదు.
ఇందుకు కారణం నువ్వే!......నువ్వే!
విమానారూఢులై ఆకాశం మీద నుంచి చూసే
దేవతలందరూ ఈ యుద్ధానికి సాక్షులు.
కాచుకో ఈ బ్రహ్మాస్త్రాన్ని........

(ఏదో విసిరిన భయంకరమైన శబ్దం.....నిప్పురవ్వలు......పెద్ద వెలుగు.....మళ్ళీ చీకటి)

(వ్యాసుడు నేపథ్యం నుంచి)

**వ్యాసుడు:** ఇదేమిటి? ఏం పని చేశావు అశ్వత్థామా!
నరాధమా? నువ్వేం చేశావో నీకు తెలుసా?

**అశ్వత్థామ:** తమ మృత్యువును తామే ఆహ్వానించుకొనే దెవరు?
నా ప్రతీకారాగ్నిని అడ్డుకొనేదెవరు?

**వ్యాసుడు:** నేనే!........నేనే వ్యాసుణ్ణి.
ఈ బ్రహ్మాస్త్రపు పరిణామమేమిటో నీకు తెలుసా?
నువ్వను కొనేదే నిజమయితే,
రాబోయే కొన్ని శతాబ్దాల వరకు
రసవంతమైన వనస్పతులుండవు.
శిశువులు వికలాంగులవుతారు.
కుష్ఠురోగులవుతారు జనం.
యావత్ మానవజాతి మరుగుజ్జులవుతారు.
సత్య, త్రేత, ద్వాపర యుగాల్లో
మానవుడు సంపాదించిన జ్ఞానమంతా
మట్టిపాలవుతుంది.....అది భయంకర
సర్పమై బుసలుకొడుతుంది.........

**అశ్వత్థామ:** తగలబడిపోనివ్వండి....బూడిదకానివ్వండి.
ప్రళయమే వచ్చినా, వ్యాసా!
చూస్తాను రక్షించగలడేమో ఈ కృష్ణుడు?

**వ్యాసుడు:** మూర్ఖుడా! అయితే అటుచూడు!
కృష్ణుడు చెప్పకపూర్వమే అర్జునుడు
ఆకాశంలో తన బ్రహ్మాస్త్రాన్ని వదిలాడు.
కాని ఓ నరాధమా! ఈ బ్రహ్మాస్త్రాలు రెండూ
ఆకాశంలో ఒకదానినొకటి ఎదుర్కొంటాయి.
అప్పుడేం జరుగుతుందో తెలుసా?
సూర్యుడి వెలుగుండదు.
నేల మరుభూమిగా మారుతుంది.

(భయానకమైన ఆర్తనాదం.........ఫెళఫెళారవాలు........తీవ్రమైన కాంతి......వెంటనే అంధకారం.)

**అశ్వత్థామ:** నేను నిస్సహాయుణ్ణి. అన్యాయంతో కృష్ణుడు
పాండవులతో కలిసి నన్ను వధించాలని
ఆతురపడుతున్నాడు....నేనేం చేయనుమరి?

వ్యాసుడు: అయ్యో!.....అర్జునా, విను. నేను వ్యాసుణ్ణి.
నువ్వు నీ బ్రహ్మాస్త్రాన్ని ఉపసంహరించు.
అశ్వత్థామా! పిరికితనంతో మానవత్వాన్ని ధ్వసం చేయకు.
నీ బ్రహ్మాస్త్రాన్ని వెనక్కు తీసుకో. మణినిచ్చేయి – వనాలకు వెళ్ళిపో.

అశ్వత్థామ: వ్యాసా! నేనే అశక్తుణ్ణి
అస్త్రాలను ప్రయోగించడమేకాని
ఉపసంహరించడం నా తండ్రి నేర్పలేదు.

వ్యాసుడు: ప్రచండమైన శక్తి ఉన్న ఈ రెండు అస్త్రాలు ఢీకొంటే
జరిగేదేమిటో తెలుసా?
సూర్యుడి వెలుగింక ఉండదు.
సమస్త ధరాతలం బంజరు భూమిగా మారుతుంది.

అశ్వత్థామ: అలాగే! అయితే వినండి!
విను వ్యాసా! విను కృష్ణా!
తిరుగులేని ఈ అస్త్రం
అశ్వత్థామ ప్రయోగించిన ఈ అస్త్రం
ఉత్తర గర్భాన్ని విచ్ఛిన్నం చేస్తుంది. తప్పదు.
వెనకకు తిరిగి మాత్రం రాదు.

(ఫెళఫెళారావాలు)

వ్యాసుడు: నువ్వు పశువ్వి......నువ్వు పశువ్వి......నువ్వు పశువ్వి.......

(అశ్వత్థామ వికటాట్టహాసం చేస్తాడు.)

అశ్వత్థామ: నిజానికి నేను పశువును కాను.
యుధిష్ఠిరుడే నన్ను పశువుగా చేశాడు.

(తెరపడింది......ముందు దృశ్యం.....నేపథ్యంలో పాండవుల బంధువులు ఆక్రందన....గాంధారి, సంజయుడు........)

గాంధారి: నడుస్తూ ఉండు సంజయా! ఆ ఆక్రందనలేమిటి?

సంజయుడు: అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రం ఉత్తర గర్భాన్ని విచ్ఛిన్నం –

గాంధారి: చేస్తుంది.......అశ్వత్థామ తన ప్రతిజ్ఞను చెల్లించుకు తీరతాడు –

యుయు: అమ్మా! కృష్ణుడు మాత్రం అతన్ని క్షమించడు.

గాంధారి: పద....నడు, సంజయా!
అశ్వత్థామను కృష్ణుడు వధించలేడు
కృష్ణుడి సుదర్శనం నన్ను ఖండఖండాలుగా చెయ్యనీ!
దీర్ఘనిద్రలో ఉన్న దుర్యోధనుడి దగ్గరకే వెడతాను..........

అంతేకాని........అశ్వత్థామను నేను రక్షిస్తాను.......

(గాంధారి, సంజయుడు వెడతారు....వెనక ధృతరాష్ట్రుడు, యుయుత్సుడు వస్తారు.

**ధృత:** వత్సా! నా ఆయుష్షు కూడా పోసుకుని జీవించు.
ఉత్తర గర్భాన్ని అశ్వత్థామ బ్రహ్మాస్త్రం విచ్ఛిన్నం చేస్తే
ఏదో ఒక రోజున యుధిష్ఠిరుడు
నిన్ను పిలిచి పట్టం కడితే –

**యుయుత్సుడు:** (కటవుగా నవ్వి)
అశ్వత్థామ పశుత్వం కారణంగా
నా పోయిన అదృష్టం తిరగివస్తుందా?
వద్దు తండ్రీ.....వద్దు......ఈ అదృష్టం చాలునాకు.

(పాండవుల జయజయధ్వానాలు వినవస్తాయి. విదురుడు వస్తాడు.)

**ధృత:** ఈ జయజయధ్వానాలేమిటి?

**విదురుడు:** నా ప్రభువు ఉత్తరను రక్షించాడు.

(ఒక్కక్షణం అందరూ స్తబ్ధులై పోతారు.)

**ధృత:** అదెలా సంభవం విదురా?

**విదురుడు:** బ్రహ్మాస్త్రం ఉత్తర గర్భాన్ని చీల్చినా
ఆమెకు మృతశిశువే జన్మించినా
నేను నా జీవితాన్ని ధారపోసి
ఆ శిశువును జీవింప చేస్తానని
ప్రభువు అన్నాడు........

**ధృత:** అశ్వత్థామను కృష్ణుడు వదిలిపెట్టాడా?

**విదురుడు:** వదిలిపెట్టాడు.....భ్రూణహత్య
చేసినందుకు మాత్రం శపించాడు.
అతని వద్దనుండి మణిని తీసుకున్నాడు.
మణిని ఇచ్చేసి, శాపాన్ని స్వీకరించి
ఖిన్నవదనుడై, తలవంచుకుని
అశ్వత్థామ వెళ్ళిపోయాడు.

**యుయు:** (ఏ భావమూ వ్యక్తం చేయడు. ప్రతి క్రియ చేయాలన్నట్లుగా కూడాఉండడు.)
నాకు సందేహంగా ఉంది.
తల్లి గాంధారి అశ్వత్థామ పరాజయం
సంగతి విని ఏం చేస్తుందో?

**ధృత:** నడు విదురా!

గాంధారి ముందుగా వెళ్ళింది.
నేనూ నెమ్మది నెమ్మదిగా వస్తాను.

(ముందర వేగంగా విదురుడు, తర్వాత ధృతరాష్ట్రుడు, యుయుత్సుడు గాంధారి వెళ్ళినవైపు వెడతారు. తెరలేస్తుంది. లోపలి దృశ్యం........సంజయుడు, గాంధారి, విదురుడు.)

**సంజయుడు:** మహారాజు దుర్యోధనుడు నేలకూలిన స్థలం ఇదే తల్లీ!
ఈ బంగారు శిరస్త్రాణం, ఈ గద, ఈ కవచం –
అన్నీ మహారాజువే తల్లీ!

(గాంధారి కళ్ళగంతలు తీసేస్తుంది. ఒక్కొక్క వస్తువును తడిమి తడిమి చూస్తుంది. కవచం మీద చేయివేస్తూనే రోదిస్తుంది.)

**విదురుడు:** సహనం, తల్లీ, సహనం. ఓరిమివహించు.
ఈ కవచం మిధ్య.
మర్యాద......దానిని పాటించడం
ఇవే నిజమైన కవచాలు మనిషికి........

(ఒక్క ఉదుటున గాంధారి నేపథ్యం వైపుకు చూస్తుంది.)

**గాంధారి:** ఆ పొదమాటున మౌనంగా కూర్చున్నదెవరు?
బ్రతికివున్న వారేనా?

**విదురుడు:** అటు చూడకు తల్లీ?

**గాంధారి:** అశ్వత్థామలా ఉన్నాడే?

**సంజయుడు:** కాదు కాదు. ఈ కురూపి
అంగాంగాలు శిథిలమై, రోగగ్రస్థమయిన
దుర్గంధభూయిష్టమైన కుక్కలా......
కాదు.....ఇతను అశ్వత్థామ కాదు......

**గాంధారి:** వెళ్ళిపోతున్నాడు. పిలు.
ఎవరతను?......పిలు......ఆపు విదురా!

**విదురుడు:** తల్లీ వెళ్ళనీ! అతను అశ్వత్థామే!
భ్రూణహత్య చేసినందుకు
కృష్ణుడతన్ని శపించాడు.
ఈ గాయాలతో ఇలాగే
జీవించి ఉండమని శపించాడు.
సుదర్శన చక్రం అతన్ని రక్తసిక్తం చేస్తూ
తిరుగుతూనే ఉంటుంది.
యుగయుగాల పర్యంతమూ

అవయవాలన్నింటి మీద బొబ్బలతో
రక్తం ఓడే గాయాలతో – పట్టీలతో
ఉమ్మి, కఫం – వీటన్నిటితో
జీవించే ఉంటాడు అశ్వత్థామ.
ప్రభువతనిని మరణించనీడు.
ఇదే అతనికి లెక్కలేనన్ని
రౌరవాది నరకాలను కలగచేస్తుంది.

**గాంధారి:** సంజయా! ఆపు అతన్ని.
అతనికి బదులుగా కృష్ణుణ్ణి
నేను ఎదుర్కొంటాను.

**సంజయుడు:** తల్లీ! అతను వెళ్ళిపోయాడు.
బహుశా: వీడ్కోలు తీసుకోవాలని
వచ్చి ఉంటాడు.
దుర్యోధనుని అస్థికల
అంతిమ దర్శనం చేసుకోవాలని
వచ్చి ఉంటాడు........

**గాంధారి:** ఏమన్నావ్! అస్థికలా?
నా పుత్రుడి అస్థికలు అక్కడపడి ఉన్నాయా ఏం?

**విదురుడు:** ఓరిమి తల్లీ! ఓరిమి వహించు......

**గాంధారి:** (హృదయ విదారకమైన స్వరంతో)
అయితే అక్కడ నా పుత్రుడి అస్థిపంజరం పడివుందా?
ఇదంతా ఆ కృష్ణుడు చేసింది కాదూ?
కృష్ణా! ఇదంతా నువ్వు చేసింది కాదూ?
విను.....ఈ తపస్విని గాంధారి చెప్పేది విను.
నా జన్మజన్మల పుణ్యబలంతో చెబుతున్నాను విను.
కృష్ణా విను.
కావాలనుకుంటే నువ్వీ యుద్ధాన్ని నివారించేవాడివి.
నీ సౌంజ్ఞమూలానే భీముడు
దుర్యోధనుణ్ణి నిర్జించాడు.
నరాధముడని అశ్వత్థామకు ఇచ్చిన శాపాన్నే
భీముడికెందు కివ్వలేదు?
నీ అధికారాన్ని దుర్వినియోగం చేశావు కృష్ణా!
నా సేవలో బలముంటే –

సంచిత తపస్సులో ధర్మముంటే –
విను కృష్ణా –
ప్రభువైనా – పరాత్పరుడివే అయినా
ఏమైనా గానీ –
నీ వంశమంతా పిచ్చికుక్కల్లాగా
ఒకరినొకరు కుమ్ముకుని పొడుచుకొని తింటారు.
నువ్వు స్వయంగా వారి వినాసనానికి కారకుడవవుతావు.....
కొన్నాళ్ళకు నీవు కూడా
దట్టమైన అడవుల్లో ఒక సామాన్యమైన వ్యాఘ్రంవలన
మరణిస్తావు.
ప్రభువయినా సరే – పశువులా మరణిస్తావు...........

(మురళీగానం......కృష్ణుడి నీడ)

కృష్ణుని ధ్వని: అమ్మా!
ప్రభువునో – పరాత్పరుడినో!
ఎవరినయినా – నీ పుత్రుణ్ణి.
నీవు నా తల్లివి.
నా పాపపుణ్యాల – యోగక్షేమాల
భారమంతా నే వహిస్తానని
అర్జునుడికి మాట ఇచ్చాను.
ఈ పద్ధెనిమిది రోజుల భీకరసంగ్రామంలో
ఒకసారి కాదు – కోటాను కోట్లసార్లు
ప్రతి సైనికుడు మరణించిన ప్రతిసారీ
మరణించింది నేనేనమ్మా!
ఎవరూ కాదు. అదీ నేనే!
మరణించింది నేనే!
అశ్వత్థామ శరీరంనుంచి ప్రవహించే
చీమూ–రక్తమూ నేనే అయి స్రవిస్తున్నాను.
యుగయుగాలదాకా
జీవించేది మరణించేది నేనే!
నీవిచ్చిన ఈ శాపాన్ని శిరసావహిస్తున్నాను.
మాతా! గాంధారీ!
ఈ శాపాన్ని ఔదలదాలుస్తున్నాను.

గాంధారి: ఏమిటది?...నువ్వేం చేశావు కృష్ణా!!

(వెక్కి వెక్కి ఏడుస్తుంది)

ఏమీ లేదు కృష్ణా.....నా నూర్గురు పుత్రులకోసం –
కృష్ణా! నీమీద నాకున్న ప్రేమ అపారం; అగాధం.
నేనిచ్చిన ఈ శాపాన్ని స్వీకరించకపోయినా
నాకు కోపం రాదయ్యా!
పుత్రహీనను నిరాశతో దు:ఖంతో కుంగిపోయి
ఇంత కటువుగా మారాను. శిలనే అయినాను.

**కృష్ణుడి ధ్వని:** అలా అనకు తల్లీ!
నేనే జీవించి ఉన్నంత కాలం నువ్వు పుత్రహీనవుకాదమ్మా!
ప్రభువునైనా – పరాత్పరుణ్ణే అయినా
నీ పుత్రుణ్ణేనమ్మ!

**గాంధారి:** నేనేం చేశాను? విదురా!
నేనే చేసిన ఈ పనేమిటి?

(రోదిస్తూ ఉంటుంది.)

### కథాగానం

## అయిదో అంకం

### విజయం: ఒక క్రమబద్ధమైన ఆత్మహత్య

### కథాగానం

(తెర లేస్తుంది. ఇద్దరు ముసలి ప్రహరీలు వెనక నుంచుని ఉంటారు. ముందు యుధిష్ఠిరుడు.)

**యుధి:** ఈ భయంకర యుద్ధం – అర్థసత్యంతో
రక్తపాతంతో, హింసతో గెలిచినా
ఓడినట్టే వుంది. ఇలా అనుకోవడం అంత
యాతన మరొకటి లేదు.
ఎవరికోసం, ఎవరితో యుద్ధం చేశామో
వాళ్లంతా అజ్ఞానులని, జడులని, నీతి బాహ్యులని అనుకున్నాం.
సింహాసనం పొందిన వాళ్ళ వెనక
గుడ్డితనం తరతరాలుగా
రాజ్యం ఏలుతున్నదనీ
వెనకటి గుడ్డితనపు వికృతపు మూసలోనే
తిరిగి పరిపాలన కొనసాగుతున్నదని
ప్రజలు అనుకుంటున్నారు.

అంతేకాదు. ఈ ద్వారానికి ఆవల అలుముకున్న
దట్టమైన అంధకారంలోకి చూస్తే
భావియుగం అడుగుల చప్పుడు
అమంగళంగా వినిపిస్తోంది.
అలా జరుగుతుందేమోనన్న భావంతో
మనసు కంపిస్తోంది.
అయినా – నుదుటి మీద మణిని ధరించి
హంతకుడైన అశ్వత్థామ బతికి ఉండడం యాతన.
సోదరా దుర్యోధనా! నువ్వెంత భాగ్యశాలివి!
ఈ అరిష్టాలను చూడకుండా వెళ్ళిపోయావు.
ఇక మిగిలింది నేను!
ఈ అమంగళమైన పద ధ్వనులను గురించి
ఎవరికి చెప్పను?
నా వాళ్ళంతా అజ్ఞానులు, మందమతులు, ముసలివాళ్ళు

(నేపథ్యంలో కలకలం; గర్జన)

బహుశా: భీముడు ఎవరినో అవమానించినట్టున్నాడు.

(భీముడి అట్టహాసం.)

ఇది–ఇదీ–పతనమౌతున్న నా వంశం.
బయటకమ్ముకున్న అంధకారం మరికొన్నాళ్ళలో
వీళ్ళనూ చుట్టుముట్టక మానదు.
మట్టుపెట్టక మానదు.
అయినా, భీముడు మాత్రం అమానుషమైన వినోదాలలో
తన్మయుడై ఉన్నాడు.

(లోపలనుంచి చాలామంది కలిసి అట్టహాసం చేస్తున్న సవ్వడి. విదుర కృపాచార్యులు ప్రవేశిస్తారు.)

**విదురుడు:** మహారాజా! భీముడి అరాచకం ఎక్కువవుతోంది.
సహించలేనంత ఎక్కువగా ఉంది....ఎలా దీన్ని ఆపడం?

**యుధి:** ఇప్పుడేమయింది విదురా?

**విదురుడు:** అదే! ఎప్పటిలాగే యుయుత్సుణ్ణి
మళ్ళీ అవమానించాడు భీముడు.

**కృపా:** మౌనంగా ఇవన్నీ సహించే యుయుత్సుణ్ణి చూసి
అందరూ గేలిచేస్తున్నారు.

**యుధి:** యుయుత్సుడు మాట్లాడకుండా ఉండడానికి

కారణం ఏమిటో? ఇప్పుడయితే మరీ మౌని అయ్యాడు.

విదురుడు: ఎన్నో ఏళ్ళుగా "తన" అనుకున్న బంధువులు,
ప్రజలుకూడా అతన్ని ఏవగించు కుంటున్నారు,
కృష్ణుడంటే అతనికి వల్లమాలిన గౌరవం.
కాని ఆయనే శాపగ్రస్తుడైనాడు కదా!

కృపా: యుయుత్సుడు మిమ్మల్నే ఆశ్రయించుకున్నవాడు.
కాని భీముడి కటువైన మాటలతో అతని మనసు గాయపడ్డది.
గాంధారీ ధృతరాష్ట్రులు అడవికి వెళ్ళిన నాటినుంచీ
అతను మూగవాడే అయినాడు.

యుధి: బంధుజనులకు విరుద్ధంగా
తన జీవితాన్నే పణంగా పెట్టాడు.
ఆఖరికి, విశ్వాసాన్ని కోల్పోయి, కళంకితుడై
అనేక యాతనలను భవించాడు.
చివరకు నరపశువు అశ్వత్థామ
చేసినట్లుగా కూడా చేయలేకపోయాడు.

(మళ్ళీ భీమగర్జన)

కృపా: మహారాజా! ఇప్పుడు మీరే పూనుకోవాలి.
యుయుత్సుడి భయాన్ని పోగొట్టడానికి.

(యుధిష్ఠిరుడు, విదురుడు, కృపాచార్యుడు లోపలకు వెడతారు. రక్షకభటులు ముందుకు వచ్చి మాట్లాడుతారు.)

1వ ర: ఒకడు పిచ్చివాడయినాడు.

2వ ర: మరొకడు శాపగ్రస్తుడైనాడు.

1వ ర: మనం మునుపెలా ఉన్నామో –

2వ ర: ఇప్పుడూ అలానే వున్నాం.

1వ ర: ప్రభువులు మారారు

2వ ర: పరిస్థితులు మాత్రం యధాతథంగా ఉన్నాయి.

1వ ర: ఇంతకు పూర్వం రాజ్యమేలిన రాజులే మంచివాళ్ళు......

2వ ర: గుడ్డివాళ్ళు........

1వ ర: కాని వాళ్ళు శాసించేవాళ్ళు
వీళ్ళు! – సాధువులు......

2వ ర: పరిపాలనేం చేస్తారు?

1వ ర: వీళ్ళకి ప్రజల స్వభావాలేం తెలుసు?

2వ ర: జ్ఞానం! – మర్యాద!!

1వ ర: వాటినేం చేసుకుంటాం?

2వ ర: దాన్నేమన్నా తిరగలి పడతామా?

1వ ర: లేకపోతే తింటామా?

2వ ర: దాన్నేమన్నా కప్పుకుంటామా?

1వ ర: లేకపోతే దాన్నేమన్నా పరుచుకుంటామా?

2వ ర: మనకి తినడానికి తిండికావాలి.

1వ ర: "ఇది చెయ్యండిరా" అని శాసించే –

2వ ర: వీరుడైనా, బలవంతుడైనా రాజుకావాలి.

1వ ర: గుడ్డిగా మనం అనుసరించే ఆజ్ఞలు కావాలి.

2వ ర: యుద్ధమయినా, శాంతి అయినా
పేరు మాత్రం వాళ్లదే!

1వ ర: ప్రజలనాడి ఇది అని ప్రభువులకెప్పుడు తెలిసేనూ?

(లోపలనుంచి యుయుత్సుడు రావడం చూసిన ప్రహారివాళ్ళు (రక్షకభటులు) మాట్టాడడం మానేస్తారు. మొదటిలాగానే వింగ్స్‌లోకి వెళ్ళినిలబడతారు. యుయుత్సుడు సగం పిచ్చివాడిలా దయనీయంగా రెండో వింగ్‌లోకి వెళ్ళిపోతాడు. ఓక్షణం తర్వాత విదురుడు, కృపాచార్యుడు ప్రవేశిస్తారు.)

విదురుడు: (రక్షకభటుణ్ణి చూసి) యుయుత్సుణ్ణి చూశావా?

(రక్షకభటుడు నేపథ్యం వైపు చూపిస్తాడు.

కృపా: అభాగ్యుడు......
రాజమార్గంలో పిచ్చివాడిలా తిరుగుతున్నాడు.

విదురుడు: రాజప్రాసాదంలో అతడు పొందిన
అవమానం తక్కువదా?
ఇప్పుడు బయటకు వెళ్ళాడు
ప్రజలు అవమానిస్తారు.

కృపా: అటు చూడు –
బిచ్చగాళ్ళు, కుంటివాళ్ళు
గుంపులు గుంపులుగా చేరి
అతని వెనకచేరి పాటలు కట్టి
పాడుతున్నారు.

విదురుడు: అయ్యో! ఎవరో రాయితో కొట్టారు.

(బాధపడుతూ అటు వెడతాడు)

కృపా: ధర్మంపక్షాన నిలబడ్డ

యుయుత్సుడి అదృష్టం
యుధిష్టిరుడి రాజ్యంలోకూడా
ఇట్లానే ఉండి.

(విదురుడు యుయుత్సుణ్ణి తీసుకువస్తాడు. నోట్లోనుంచి రక్తం కారుతూ ఉంటుంది. విదురుడు ఉత్తరీయంతో రక్తాన్ని అద్దుతాడు. వెనకాలగా వచ్చి మూగసైనికుడు యుయుత్సుణ్ణి రాయి తీసుకుని కొడతాడు. అట్టహాసంగా భయంకరంగా నవ్వుతాడు.)

విదురుడు: ఎవరక్కడా?.....ఈ బిచ్చగాణ్ణి ఇక్కడికెవరు రానిచ్చారు?
యుయుత్సా!..........నా వెంటరా.

(బిచ్చగాడు పాశవికమైన సంజ్ఞలతో "వీడు నా కాళ్ళు విరగ్గొట్టాడు. నేనే వీడిమీద ప్రతీకారం ఎందుకు తీర్చుకోకూడదు" అన్నట్లుగా ఉంటాయి వాడి చేష్టలు.)

కృపా: యుయుత్సుగు కనక కాళ్ళు విరగ్గొట్టి ఊరుకున్నాడు.
నేనివాళ నీ ప్రాణాలు తీస్తాను.

(రక్షకభటుడి చేతులోనుంచి బల్లెం తీసుకుని పరిగెత్తుతాడు. మూగవాడు పారిపోతాడు. యుయుత్సుడు వచ్చి కృపాచార్యుణ్ణి ఆపుతాడు. ఆ బల్లెం తన చేతిలోకి తీసుకుంటాడు. దాన్ని తన గుండెలమీద పెట్టుకుని ఆదుముకుంటూ నేపథ్యంలోకి వెళ్ళిపోతాడు. లోపలనుంచి భయంకరమైన అరుపు. విదురుడు పరిగెత్తుకుంటూ వస్తాడు.)

విదురుడు: యుయుత్సుడు ఆత్మహత్య చేసుకున్నాడు మహారాజా!
పరిగెత్తు కృపాచార్యా!

(కృపాచార్యుడు వెడతాడు.....రక్షకభటులు ముందుకు వస్తారు.)

1వ ర: యుద్ధంకానీ – శాంతికానీ –
2వ ర: రక్తపాతం జరగక తప్పదు.
1వ ర: అస్త్ర శస్త్రాలు ఉన్నాయి అంటే
2వ ర: ఉపయోగించవలసిందే కదా!
1వ ర: ఇప్పటిదాకా ఆ అస్త్రాలు –
2వ ర: శత్రువులను వధించడానికి
1వ ర: ఇప్పుడు తమని తాము పరిమార్చుకోవడానికి –
2వ ర: ఇవిగో! మనవీ ఉన్నాయి
ఇప్పటిదాకా పనికి రాకుండా పడిఉన్నాయి.
1వ ర: కనీసం ఇవ్వాళ అయినా ఉపయోగపడ్డాయి.

(లోపలినుంచి సామూహికమైన అట్టహాసాలు, పరిహాసాలు. కృపాచార్యుడు వస్తాడు.)

కృపా: ఇంత జరిగితే నవ్వుతున్నారు....అజ్ఞానులు, మూఢులు, అహంకార
పూరితులు, దుర్నీతిపరులు. యుధిష్ఠిరుడు ఆక్రమించిన

ఈ భూమి మీద యుయుత్సుడు తన రక్తంతో రాసిన
భవిష్యత్తును ఇవాళ ఎవ్వరూ అర్థం చేసుకోవడం లేదు.
సంస్కృతిలో, వేదాంతంలో, కళల్లో, శాసనవ్యవస్థలలో
ఈ ఆత్మహత్య ప్రతిధ్వనిస్తుంది........మానవుడి అంతిమ లక్ష్యం
ఆత్మహత్యే అవుతుంది.

విదురుడు: కాని బంధువుల్ని, తల్లిని, ప్రియురాలిని, చిన్నపిల్లల్ని, స్త్రీలని
హత్య చేసిన వాళ్ళకి కూడా ముక్తి లభిస్తుంది – ఎప్పుడో ఒకప్పుడు.
కాని ఆత్మహత్య చేసుకున్నవాడు అంధకార లోకాల్లో ప్రేతాత్మగా
తిరుగుతూనే ఉంటాడు.

కృపా: యుయుత్సుడి సంగతీ ఇంతే!
విదురా! ఇవ్వాళ నేను యుధిష్ఠిరుడి రాజప్రాసాదంలో
అమంగళం అడుగులు వెయ్యడం విన్నాను.
ఇప్పటిదాకా పరీక్షిత్తుకి అస్త్రశస్త్రాలను పయోగించడం నేర్పుతున్నాను.
కాని ఇక్కడ – ఎటుచూసినా – ఆత్మహత్య చేసుకోవడానికి
ప్రేరేపించే పరిస్థితులే – చుట్టూ కడలిలా పొంగుతున్నాయి.
ఇహ హస్తినాపురాన్ని విడిచివెళ్ళడం క్షేమం అనిపిస్తుంది.
ఆత్మహత్య అంతటా అంటురోగంలా వ్యాపిస్తోంది.

విదురుడు: కాని కృపాచార్యా –

కృపా: ఉహూ! కాదు, నా వల్ల కాదు.
నేనిక్కడ ఉండలేను......వీరుణ్ణి నేను.
ఆత్మహత్యలే సంస్కృతిగా మారిన
ఆ రాజ్యంలో నేనుండలేను.

(వెళ్ళిపోతాడు)

విదురుడు: యుధిష్ఠిరుడి రాజ్యంలో ఆత్మహత్యలు జరుగుతాయి.
ఆర్ద్రహృదయులందరూ నిర్వాసితులౌతారు!
ప్రభూ! నీవు ప్రసాదించిన శాంతి ఇదేనా?
ధృతరాష్ట్రుడికి – వనాల్లో ఉన్న ధృతరాష్ట్రుడికి –
యుయుత్సుడి మరణం గురించి తెలిసేనా?

(యుధిష్ఠిరుడు ప్రవేశిస్తాడు)

యుధి: యుయుత్సుడింకా కొనఊపిరితో ఉన్నాడు.

విదురుడు: బ్రతికే ఉన్నాడా? నా కుటీరానికి పంపండి.
సపర్యలు చేసి రక్షిస్తాను.

అతడు ఇప్పటిదాకా అనుభవించిందంతా
కృష్ణుడి కోసమే! దానికి ప్రతిఫలంగా
నేనివ్వగలిగిందంతా ఇవ్వడానికి ప్రయత్నిస్తాను.......

(విదురుడు, యుధిష్టిరుడు వెళ్ళిపోతారు.)

1వ ర: సమయం కాని సమయంలో ఈ అంధకారం ఏమిటి?

2వ ర: ధూమ్రమేఘాలు చుట్టుముడుతున్నాయి.
అవి-అటు-ఆ అరణ్యం వైపు నుంచి -

(మాట్లాడుకుంటూ త్వరగా నేపథ్యంలోకి వెళ్ళిపోతారు)
(లోపలి పరదా లేస్తుంది. తగలబడుతున్న అడవిలో ధృతరాష్ట్రుడు, సంజయుడు)

**ధృత:** పోనీ సంజయా! ఇక నువ్వు నన్ను రక్షించలేవు.
వృద్ధుణ్ణి! ఈ మంటలను తప్పించుకుని
ఎక్కడికని పరుగెత్తగలను?

**సంజయుడు:** కొద్ది దూరంలోనే సురక్షితమైన స్థలం ఉంది మహారాజా!
నెమ్మదిగా నడవండి. (వెనక్కు తిరిగి) అయ్యో! తల్లీ!
గాంధారీ!.....గాంధారీ దేవి అక్కడే కూర్చుండిపోయింది.
అమ్మా......అమ్మా.....

**ధృత:** సంజయా! ఇంక ఇప్పుడీ ప్రయత్నాలన్నీ వ్యర్థం. నువ్వునన్నిక్కడే
వదిలిపెట్టు. జీవితమంతా అంధకారలోకంలో దోవతప్పి తిరిగాను.
ఇది......ఇది మండించే నిప్పుకాదు.....నా పాలిటి జ్యోతి.....
ఇంతకాలం చూడలేని వాణ్ణి కనక దీనిని గ్రహించలేకపోయాను.
ఇప్పుడు - కనీసం నా అస్థికలమీద - శిధిలమైన ఈ ముసలి అస్థికలమీద
ఈ అగ్నిమాలను, ఈ సత్యాన్ని ధరిస్తాను........కాంతిని గ్రహిస్తాను.

**సంజయుడు:** అగ్ని వ్యాపిస్తోంది. మహారాజా! గాంధారీదేవి అగ్నికీలల్లో చిక్కుకున్నది.
అయ్యో! ఎవరినని రక్షించను?

**గాంధారి:** సంజయా! నువ్వు వెళ్ళు.....వెళ్ళిపో -
ఇది నేనే శ్రీకృష్ణుడికిచ్చిన శాపమే!
అగ్ని, ఆత్మహత్య, అధర్మం, గృహకలహాలు - ఇలా ఇలా
అనేక రూపాలలో విస్తరించింది......
నగరాల్లో, అడవుల్లో -
సంజయా! అతనితో చెప్పు -
నా శాపాగ్నికి నేనే మొదటి సమిధనయ్యానని -
అతనితో చెప్పు........

(నేపథ్యంనుంచి 'గాంధారీ' అని పిలుపు)

ధృత: అయ్యో! అడవిలో కుంతి దారితప్పినట్లుగా ఉంది.
వెళ్ళు గాంధారీ!

సంజయుడు: మహారాజా! మహారాజా!
భీషణమైన ఆ దావాగ్ని తన లెక్కలేనన్ని నాలుకలను చాపి
తల్లి కుంతిని పొట్టన పెట్టుకుంది.........
మీరటు వెళ్ళకండి మహారాజా!
ఇది సురక్షితమైన స్థలం.....ఇక్కడే ఉండండి......

గాంధారి: సంజయా! జీవితమంతా గుడ్డితనపు అంధకారంలో
తడుముకుంటూ దోవతప్పిపోయిన ఆయన్ని
ఈ ప్రాణాంతకమైన వెలుగులోపడి మరణించనీ!
(ధృతరాష్ట్రుణ్ణి తీసుకుని గాంధారి వెళ్ళిపోతుంది.)

సంజయుడు: (అటు ఇటూ చూచి) ఇవాళ – భగభగ మండుతున్న వటవృక్షం
నా మీద పడ్డది. అయినా బ్రతికే ఉన్నాను. ఎందుకు?....ఎందుకు?
నా వంటి నిష్ప్రయోజకుడు ఇంకెవ్వడూ ఉండడు......

(కాలుతున్న కొమ్మఅతని కాళ్ళమీద పడ్డది. కాలు పట్టుకుని కూర్చుండిపోతాడు.)
(వెనక పరదా పడుతుంది.)

## కథాగానం

(ఒక పక్కనుంచి రక్షక భటులు వస్తారు. ఒకడి బల్లెంమీద యుధిష్ఠిరుడి కిరీటం ఉంది.)

1వ ర: ఇది చక్రవర్తిది......సమ్రాట్టుది.....

2వ ర: ఆయన విడిచిపెట్టాడు.....నువ్వు పెట్టుకో –

1వ ర: హస్తినాపురంలో అపశకునాలు కనిపించడం మొదలైన నాటినుంచీ –

2వ ర: కిందపెట్టు దాన్ని..........మహారాజు వస్తున్నాడు...
(యుధిష్ఠిరుడు, విదురుడు వస్తారు.)

విదురుడు: మహారాజా! ఇది ఖచ్చితంగా అపశకునాల ఫలితమే!

యుధి: యాదవకులంలో కలహాలు మితిమీరాయని
దూతలు చెప్పినప్పుడే అనుకున్నాను.
కృష్ణుడి మరణం ఆసన్నమైనదని

విదురుడు: అర్జునుణ్ని వెంటనే ద్వారకకు పంపండి.

యుధి: ఏం చెయ్యను నేను? మా తల్లి కుంతి, తల్లి గాంధారి, మహారాజు
ఆదావాగ్నికి బలి అయిపోయారు. తర్పణాలిచ్చాక – గాయంమళ్ళీ
పచ్చిగా అయింది. యుయుత్సుడి మరణంతో అయిన గాయం!
వాడి ప్రాణాలు రక్షించుకోలేక పోయాను. అంతా వాడు అనుకున్నట్టుగానే

జరిగింది.......ఆత్మహత్య చేసుకున్నాడు......ఇంత జరిగినా
ఇంకా ప్రభువు మరణాన్ని చూడడానికి నేను బ్రతికి ఉండాలంటారా?
లేదు......లేదు.....నన్ను పోనీ........హిమాలయ శిఖరాల్లో కరిగిపోనీ......

విదురుడు: మహారాజా! అదికూడా ఆత్మహత్యే!
నీచ కర్మలు చేసి శిఖరాల నధిరోహించబూనడం –
వాటికి పరిష్కారం కాదు.......అవును......అది కూడా ఆత్మహత్యే!

యుధి: ఇది మాత్రం విజయమా?
చాలా కాలంగా –
ఆత్మహత్య తప్ప
వేరే శరణ్యం లేదని
నెమ్మది నెమ్మదిగా అనిపిస్తోంది.

(మాట్లాడుతూ మాట్లాడుతూ రెండోవైపు వెళ్ళిపోతారు. రక్షకభటులు ముందుకు వస్తారు.)

1వ ర: రోజురోజుకూ అపశకునాలు ఎక్కువ అవుతున్నాయి.

2వ ర: నిన్నటి తుఫానులో రాళ్ళవర్షం పడింది.

1వ ర: సూర్యుడిలో తలల్లేని నల్లని మొండాలు మెదులుతున్నట్లు
కనిపించాయి.

2వ ర: అందరూ "తమ ప్రభువు" అనుకుంటున్న
అతని మరణం ఆసన్నమయింది.

1వ ర: ద్వారకలో అర్థరాత్రి నల్లటి వేషం ధరించి
కాలుడు తిరుగుతున్నాడని అందరూ చెప్పుకుంటున్నారు.

2వ ర: పెద్ద పెద్ద ధనుస్సులనుంచి బాణాలు వదులుతున్నారు విలుకాళ్ళు.
కాని తుఫానుగాలికి అవి కూడా ఎగిరిపోతున్నాయిట!

1వ ర: వీళ్ళంతా 'ప్రభువు' అనుకుంటున్న వాడు

2వ ర: వీళ్ళ యోగక్షేమాల్ని భుజాన వేసుకుని తిరిగేవాడు.

1వ ర: ఆయనే వీళ్ళందర్నీ పద భ్రష్టులుగాను, లక్ష్యభ్రష్టులుగాను వదిలేసి

2వ ర: తన లోకానికి తాను పోవడానికి
ఏర్పాటు చేసుకుంటున్నాడు........